మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 20-10-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 111 Issue: 111

20 అక్టోబర్ 2025 - సోమవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు ఆశ్వయుజ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:14 సూర్యాస్తమయం - సా. 5:47 తిథిః చతుర్దశి మ. 3:46 వరకు తరువాత అమావాస్య సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం హస్త రా. 8:12 వరకు తరువాత చిత్తా యోగం వైధృతి రా. 2:250 వరకు కరణం శకుని మ. 3:46 వరకు చతుష్పాద తె. 4:480 వరకు వర్జ్యం తె. 5:10 నుండి ఉ. 6:57 వరకు దుర్ముహూర్తం మ. 12:23 నుండి మ. 1:10 వరకు మ. 2:42 నుండి మ. 3:28 వరకు రాహుకాలం ఉ. 7:40 నుండి ఉ. 9:07 వరకు యమగండం ఉ. 10:34 నుండి మ. 12:00 వరకు గుళికాకాలం మ. 1:27 నుండి మ. 2:54 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:38 నుండి తె. 5:26 వరకు అమృత ఘడియలు మ. 1:39 నుండి మ. 3:25 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:37 నుండి మ. 12:23 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com

పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు దీపావళి శుభాకాంక్షలు.

పండుగ సందర్భంగా నేడు మా కార్యాలయానికి సెలవు. మంగళవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.

**బొమ్మకంటి శ్రావణ్ కుమార్**
ఎడిటర్



# అయోధ్య నగరం.. దీపదీపంలో రామనామం

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య నగరం మరోసారి చరిత్ర సృష్టించింది. ఈ సంవత్సరం జరిగిన అద్భుతమైన దీపోత్సవ్ వేడుకల్లో అత్యధిక సంఖ్యలో ప్రజలు ఏకకాలంలో 'దీప రొటేషన్' చేయడంతో పాటు, ఘాట్‌లలో ఏకంగా 26,17,215 నూనె దీపాలను వెలిగించి, రెండు కొత్త గిన్నిస్ ప్రపంచ రికార్డులను నమోదు చేసింది. ఈ ఘనతకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదివారం అందుకున్నారు.

అయోధ్య: అయోధ్యలోని సరయూ నదీ తీరంలోని రామ్ కీ పైడీ వద్ద దీపాలు, రంగురంగుల లైట్లతో ఘాట్‌లు వెలిగిపోగా, లేజర్ మరియు లైట్ షోతో కూడిన రామ లీలా ప్రదర్శన కూడా జరిగింది. ఈ సంవత్సరం దీపోత్సవ్‌ను భారీ విజయవంతం చేయడానికి వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు చెందిన వేలాది మంది వాలంటీర్లు ఏకమయ్యారు. వాలంటీర్లు ఉదయం నుంచే దీపాలను సిద్ధం చేయడం, వాటికి తరువాయి 2 వ పేజీలో...



## జేఈఈ మెయిన్-2026 షెడ్యూల్ విడుదల

**జనవరి, ఏప్రిల్‌లో రెండు విడతలుగా పరీక్షలు**

**జనవరి సెషన్‌కు అక్టోబరు నుంచే దరఖాస్తులు**

**ఏప్రిల్ 1 నుంచి 10 వరకు రెండో విడత పరీక్షలు**

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ 2026కు సంబంధించిన కీలక ప్రకటన వెలువడింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఈ పరీక్షల షెడ్యూల్‌ను అధికారికంగా ఖరారు చేసింది. రెండుతరువాయి 2 వ పేజీలో...

# ధరణి దొరల చుట్టం

## భూములపై కొందరి ఆధిపత్యం.. భూభారతితో విముక్తి కలిగింది

**బీఆర్ఎస్ ఓటమికి ధరణే కారణం**

**సీఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ**

**సర్వేయర్లకు లైసెన్సుల పంపిణీ**

హైదరాబాద్, అక్టోబర్ 19 (ఈవార్తలు): భూమిపై ఆధిపత్యం కోసం గత చరిత్రలో అనేక యుద్ధాలు జరిగాయని, కాబట్టి సర్వే పనుల్లో ఏమాత్రం తప్పులు జరిగినా ప్రజలు తిరగబడే అవకాశం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికపై శిక్షణ పూర్తి చేసుకున్న సర్వేయర్లకు లైసెన్సుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి చట్టం కొందరు 'దొరలకు చుట్టుముట్టుగా' మారిందని విమర్శించారు. ఆ చట్టాన్ని అడ్డుపెట్టుకుని కొందరు వ్యక్తులు భూములపై తరువాయి 2 వ పేజీలో...

**చీకట్లు తొలగిపోయాయి**



రెండేళ్ల ప్రజాపాలనలో ప్రజల జీవితాల్లో చీకట్లు తొలగిపోయాయి. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కొత్త వెలుగులు తీసుకువచ్చింది. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ వెలుగుల పండుగను రాష్ట్రంలోని ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి. దీపాల కాంతులతో ప్రతి ఇంటా సుఖ సంతోషాలు వెల్లివిరియాలి. పర్యావరణానికి హాని కలిగించకుండా చిన్నాపెద్ద ప్రతిఒక్కరూ ఆనందంగా దీపావళి జరుపుకోవాలి. ప్రమాదాలకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి.

– సీఎం రేవంత్ రెడ్డి



# నక్సల్స్‌కు కటీఫ్ చెప్పండి

## లేకపోతే మీ గుట్టు బయటపెడతాం

**బండి వార్నింగ్.. తప్పువైపుంటే పతనమేనని హెచ్చరిక**

న్యూఢిల్లీ/కరీంనగర్, అక్టోబర్ 19 (ఈవార్తలు): మావోయిస్టులతో సంబంధాలు ఉన్న తెలంగాణలోని రాజకీయ నాయకులను ఉద్దేశించి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదివారం సంచలన ట్వీట్ చేశారు. రాజకీయ రంగ స్థలంలో ప్రజాస్వామ్యం గురించి వల్లె వేస్తూ.. మావోయిస్టులకు మద్దతిస్తున్న నేతలారా వెంటనే సాయుధ వర్గాలతో ఉన్న సంబంధాలను తెంచుకోండి. లేనిపక్షంలో మీ గుట్టు బయటపడుతుందని ఆయన హెచ్చరించారు. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో, అమిత్ షా మార్గదర్శకత్వంలో కేంద్ర సంస్థలు మావోయిస్టు నిర్మూలనకే పరిమితం కావడం లేదు.. అవినీతి, నేరం, ఉగ్రవాద సంబంధాల నెట్వర్క్‌ను సైతం వెలికి తీస్తున్నాయి. దేశ భద్రతకు ముప్పుగా పరిగణించే వాళ్లు ఎవరైనా సరే తప్పించుకోలేరు అని రాసుకొచ్చారు. దేశ అంతర్గత భద్రత విషయంలో తప్పు వైపు నిలబడితే ఎంతటి ఉన్నత నాయకులైనా

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.13,086 |
| వెండి (గ్రాము): | రూ.190 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,555 |

# వాళ్లేమైనా దొంగలా?

**అర్ధరాత్రి అరెస్టు చేయడమేంటి?.. బీసీ నాయకుల అరెస్టుపై ఆర్ కృష్ణయ్య**

బీసీ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన బీసీ బంద్ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి తొమ్మిది మంది బీసీ సంఘాల నేతలను పోలీసులు అరెస్ట్ చేయడంపై బీసీ జేఏసీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. దొంగలు, నక్సలైట్లను అరెస్టు చేసినట్లుగా బీసీ నేతలను అర్ధరాత్రి అరెస్టు చేస్తారా? అని మండిపడ్డారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అర్ధరాత్రి అరెస్టు చేయడం సరికాదన్నారు.



హైదరాబాద్, అక్టోబర్ 19 (ఈవార్తలు): ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆర్.కృష్ణయ్య.. శనివారం నాటి బంద్ సందర్భంగా చిన్న చిన్న సంఘటనలు జరిగాయని, వీటిని ఆసరాగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం బీసీ ఉద్యమాన్ని అణిచివేయాలని కుట్ర చేస్తోందని ధ్వజమెత్తారు. పెద్ద ఎత్తున బంద్ జరిగిందని, కానీ పోలీసులు - 2 వ పేజీలో...

# రెడ్లను తిడితే ఊరుకోం

**ఈబీసీ జేఏసీ హెచ్చరిక.. 6 అంశాలపై తీర్మానం**

సోమాజిగూడ/హైదరాబాద్, అక్టోబర్ 19 (ఈవార్తలు): రెడ్లను కొంతమంది కులం పేరుతో దూషిస్తున్నారని, అలా తిడితే ఊరుకోబోమని ఈబీసీ జేఏసీ హెచ్చరించింది. ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఫార్వ్డ్ క్యాస్ట్ ఈబీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈబీసీ హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం, భవిష్యత్ లో అనుసరించాల్సిన విధానాలపై కార్యాచరణపై నేతలు చర్చించారు. ఈ సందర్భంగా ఆరు అంశాలపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. అగ్రకులాలను కులాలను దూషిస్తూ ద్వేషపూరిత ప్రసంగాలు చేయడం పట్ల కఠినంగా తరువాయి 2 వ పేజీలో...

# మల్లోజుల, ఆశన్న విప్లవ ద్రోహులు



**వారికి ప్రజలే తగిన శిక్ష విధిస్తారు**

**మావోయిస్టు కేంద్ర కమిటీ లేఖ**

# 4 రోజులు వానలు

**బంగాళాఖాతంలో అల్పపీడనం**

## విశ్వవాణి



ఎవరైతే ప్రతి రోజు తమ లక్ష్యాలను నోట్‌బుక్‌లో రాసుకుంటారో, ఆ లక్ష్యాల్లో 42 శాతం సాధిస్తున్నారని తాజా అధ్యయనం వెల్లడించింది.

# వాళ్ల సంగతి చూస్తా

## రెండేళ్లలో బీఆర్ఎస్ సర్కారు.. ఎవరెవరి పని చెప్పాలో తెలుసు

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. రాజేంద్రనగర్ ఎమ్మెల్యేకు వార్నింగ్**

అధికార కాంగ్రెస్ పార్టీపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెసోళ్లు జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు ఎన్నో అభివృద్ధి పనులు చేసిందని చెప్పారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఏం చేస్తలేదని ఆరోపించారు.

హైదరాబాద్, అక్టోబర్ 19 (ఈవార్తలు): తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. రెండేళ్లలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన డెవలప్‌మెంట్ ఏమీ లేదని విమర్శించారు. తాము కరోనా కాలంలో కూడా రోడ్లు వేశామని తెలిపారు. హైదరాబాద్‌లో చెత్త తీసేటోళ్లు లేరని, రోడ్ల మీద గుంతలు పూడ్చడం లేదని, కొత్తగా వాటర్ బిల్లులు వస్తున్నాయని, కరెంట్ సక్కగా ఉండటం లేదని ఆరోపించారు. రెండేళ్లలో ఏం చేయలేని వ్యక్తి, ఇంకా రెండేళ్లలో ఏం చేస్తారని ప్రశ్నించారు. రాజేందర్ నగర్ ఎమ్మెల్యే కూడా డెవలప్‌మెంట్ తరువాయి 2 వ పేజీలో...



## రాశి ఫలాలు

20.10.2025

మేషం: భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. అనుకున్న పనులు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక పురోగతి సాధిస్తారు. దూరపు బంధువుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి.

వృషభం: ప్రముఖులతో పరిచయాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. గృహమున ఆశ్చర్యకరమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగాలలో ఉన్నత పదవులు పొందుతారు. సంతాన విషయంలో శుభవార్తలు అందుతాయి. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి.

మిధునం: దైవ కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. చేపట్టిన పనుల్లో ఆటంకాలు ఉంటాయి. కుటుంబ సభ్యులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. వ్యాపార, ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి. స్వల్ప అనారోగ్య సమస్యలుంటాయి. నూతన రుణయత్నాలు కలసిరావు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి.

కర్కాటకం: చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో వివాదాలు పరిష్కారమౌతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆకస్మిక ధన, వస్తు లాభాలు పొందుతారు.

సింహం: నూతన వాహన కొనుగోలుకు అవరోధాలు తొలగుతాయి. వ్యాపారమునకు పెట్టుబడులు అందుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆర్థిక లావాదేవీలు సంతృప్తినిస్తాయి. ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. బంధువులతో సంబంధ బాంధవ్యాలు మెరుగుపడుతాయి.

కన్య: నిరుద్యోగుల ప్రయత్నాలు కొంత వరకు అనుకూలిస్తాయి. నూతన రుణయత్నాలు చేస్తారు. దూర ప్రయాణాలలో వాయిదా పడుతాయి. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. వృధా ఖర్చులు పెరుగుతాయి.

తుల: స్థిరాస్తి కొనుగోలుకు అవరోధాలు తొలగుతాయి. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. సేవ కార్యక్రమాలకు ధన సహాయం అందిస్తారు. వ్యాపార, ఉద్యోగాలలో వివాదాలు సర్దుమణుగుతాయి. కుటుంబ సభ్యులతో దైవ దర్శనాలు చేసుకుంటారు. కొన్ని వ్యవహారాలలో ఆప్తుల సలహాలు పాటిస్తారు.

వృశ్చికం: కుటుంబ సభ్యులతో వివాదాలు కలుగుతాయి. ఇంటా బయట పరిస్థితులు అంతగా అనుకూలించవు. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఉద్యోగాలలో సమస్యలు తొలగుతాయి. చేపట్టిన పనులలో వ్యయప్రయాసలు అధికామౌతాయి. ఆకస్మిక ధన వ్యయ సూచనలున్నవి.

ధనస్సు: ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. పనులు చకచకా సాగుతాయి. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశములు అందుతాయి. మీ నిర్ణయాలు అందరికి నచ్చే విధంగా ఉంటాయి. వ్యాపారమున భాగస్థుల ప్రవర్తన ఆశ్చర్యపరుస్తాయి.

మకరం: వ్యాపార వ్యవహారాలు అనుకూలంగా సాగుతాయి. సంఘంలో పలుకుబడి పెరుగుతుంది. పాతమిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. ఉద్యోగాలలో అధికారులతో వివాదాలు పరిష్కారమౌతాయి. ఆర్థిక లావాదేవీలు సంతృప్తినిస్తాయి. విలువైన వస్త్ర వస్తులాభాలు పొందుతారు.

కుంభం: దూర ప్రయాణ సూచనలున్నవి. సన్నిహితులతో విభేదాలు చికాకు పరుస్తాయి. కుటుంబంలో కొందరి మాటలు మానసికంగా బాధిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. పాత ఋణలు తీర్చడానికి నూతన రుణాలు చేయాల్సి వస్తుంది. దైవదర్శనాలు చేసుకుంటారు.

మీనం: కుటుంబ సభ్యులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. చేపట్టిన పనులలో శ్రమ పెరుగుతుంది. ఆర్థిక పరంగా సమస్యలు తప్పవు. వ్యాపార, ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి. వాహన ప్రయాణాలలో జాగ్రత్త అవసరం దైవ చింతన కలుగుతుంది. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం.

# జేఈఈ మెయిన్-2026 షెడ్యూల్ విడుదల

మొదటి పేజీ తరువాయి

విడతల్లో (సెషన్లలో) ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. తొలి విడత పరీక్షలు జనవరిలో, రెండో విడత ఏప్రిల్‌లో జరగనున్నాయి. విద్యార్థులు తమ సన్నద్ధతను వేగవంతం చేసేందుకు ఈ ప్రకటన ఎంతగానో దోహదపడుతుంది. ఎన్టీఏ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం, జేఈఈ మెయిన్ 2026 తొలి సెషన్ పరీక్షలు జనవరి 21 నుంచి జనవరి 30 మధ్య నిర్వహిస్తారు. ఈ సెషన్‌కు హాజరు కావాలనుకునే విద్యార్థులు ఈ అక్టోబరు నుంచే తమ దరఖాస్తులను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఇక రెండో సెషన్ పరీక్షలు ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 10 వరకు జరగనున్నాయి. ఈ సెషన్‌కు సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియ జనవరి చివరి వారంలో ప్రారంభమవుతుందని ఎన్టీఏ తెలిపింది. అభ్యర్థులు తమ దరఖాస్తులను అధికారిక వెబ్‌సైట్ jeemain.nta.nic.inలోని క్యాండిడేట్ యాక్టివిటీ విభాగం ద్వారా సమర్పించవచ్చు. దరఖాస్తు ప్రక్రియను విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సులభంగా పూర్తి చేసేందుకు అవసరమైన పత్రాలను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలని ఎన్టీఏ సూచించింది.

ముఖ్యంగా ఆధార్ కార్డ్, దివ్యాంగుల కోసం యూడీఐడీ కార్డ్, మరియు వర్తించే కేటగిరీ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలి. అంతేకాకుండా, విద్యార్థులు తరచూ అడిగే కొన్ని ప్రశ్నలకు ఎన్టీఏ స్పష్టత ఇచ్చింది. దరఖాస్తు పూర్తి చేసిన తర్వాత కన్ఫర్మేషన్ పేజీతో సహా ఎలాంటి పత్రాలను పోస్ట్, ఫ్యాక్స్, వాట్సాప్ లేదా వ్యక్తిగతంగా ఎన్టీఏ కార్యాలయానికి పంపాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. మొత్తం ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లోనే జరుగుతుంది.

అలాగే, 12వ తరగతికి సంబంధించి ఐదు సబ్జెక్టులను ఎంచుకుంటే సరిపోతుందని, జేఈఈ మెయిన్‌కు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ తప్పనిసరి సబ్జెక్టులని తెలియజేసింది. జేఈఈ మెయిన్ పరీక్షలో ప్రధానంగా రెండు పేపర్లు ఉంటాయి. దేశంలోని ప్రఖ్యాత నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇతర కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సాంకేతిక సంస్థలలో అండర్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ ప్రోగ్రామ్‌ల (బీఈ/బీటెక్) ప్రవేశాల కోసం పేపర్ 1 నిర్వహిస్తారు. ఈ పేపర్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఐఐటీలలో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాయడానికి అర్హత పొందుతారు. ఇక దేశవ్యాప్తంగా బీఆర్క్, బీప్లానింగ్ కోర్సులలో ప్రవేశాల కోసం పేపర్ 2 నిర్వహిస్తారు. విద్యార్థులు తమ లక్ష్యాలకు అనుగుణంగా సరైన పేపర్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జేఈఈ మెయిన్‌లో మంచి ర్యాంకు సాధించడం విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుందనడంలో సందేహం లేదు.

# వాళ్ల సంగతి చూస్తా

మొదటి పేజీ తరువాయి

పేరుతో అధికార పార్టీలోకి పోయిండని, ఆయన ఎవరి డెవలప్‌మెంట్ కోసం పోయాడని ప్రశ్నించారు. అన్ని విషయాలు బయటకు వస్తాయని అన్నారు. మరో రెండేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు ఎవరెవరి సంగతి చూడాలో వాళ్ళ సంగతి చూస్తామని, ఎవరెవరి బెండు తీయాలో తీస్తామని హెచ్చరించారు. ఇదివరకు మాదిరిగా ఉండదని సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రం మొత్తం కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటుందని అన్నారు. ప్రజల కోరిక తప్పకుండా తీరుతుందని చెప్పారు. దోఖా చేసిన కాంగ్రెస్‌ను దెబ్బకొట్టే మంచి మొఖా జూబ్లీహిల్స్ ప్రజలకు దొరికిందని అన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల ప్రజలకు కూడా తప్పకుండా అవకాశం వస్తుందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్– బీజేపీ రెండు జాతీయ పార్టీలు... తెలంగాణ బీసీలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత రాజేంద్ర నగర్ నియోజకవర్గాన్ని దెబ్బగొట్టారని... బీఆర్ఎస్ హయాంలో ఎయిర్‌పోర్టు మెట్రోకు టెండర్లు పూర్తి చేస్తే రేవంత్‌రెడ్డి వచ్చాక రద్దు చేశారని ఆరోపించారు. తనకు భూములు ఉన్నాయనే అనుమానంతో రేవంత్ రెడ్డి ఇలా చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆక్రమణల పేరుతో పేదల ఇళ్లు కూలగొడుతుందని కేటీఆర్ ఆరోపించారు. హైడ్రా అనేది పేదోళ్ల ఇండ్లు కూలగొట్టి ఫోజులు కొడుతుందని విమర్శించారు. అదే పెద్దోళ్లను భయపెట్టి పైసలు వసూళ్లు చేసి వదిలేస్తుందని ఆరోపించారు. ఇప్పటివరకు ఒక్క పెద్ద వ్యక్తి ఇల్లు అయినా కూలగొట్టారా? అని ప్రశ్నించారు. మూసీకి అడ్డంగా నిర్మాణాలు చేపడుతున్నవారిని ఎవరూ పట్టించుకోవట్లేదని ఆరోపించారు. ఈ దిక్కుమాలిన ఆలోచనలు, విధానాలతోనే రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ కుప్పకూలిందని మండిపడ్డారు.

# వాళ్లేమైనా దొంగలా?

మొదటి పేజీ తరువాయి

ఉద్దేశపూర్వకంగానే బీసీ నాయకులను అర్ధరాత్రి అరెస్టు చేశారన్నారు. ముఖ్యమంత్రి జోక్యంతోనే ఈ అరెస్టులు జరిగాయని చెబుతున్నారని, దీనిపై లోతుగా తెలుసుకుంటామన్నారు. చిన్న విషయాలకు కేసులు పెడితే బీసీ వ్యతిరేకత మూటకట్టుకోవాల్సి వస్తుందని సీఎంను హెచ్చరించారు.

### 8 మందిపై కేసు నమోదు

బజాజ్ ఎలక్ట్రానిక్స్ మేనేజర్ సయ్యద్ అమీనుద్దీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు 8 మంది బీసీ యువకులను అరెస్టు చేశారు. బుజ్జ కృష్ణ, నిఖిల్, రామకోటి, రాజ్ కుమార్, మోడీ, సాయిబాబా, రవితేజ, రామ్మూర్తిపై వివిధ సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆ యువకులకు గాంధీ హాస్పిటల్‌లో వైద్య పరీక్షల అనంతరం జడ్జి ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. కాగా.. దాడులకు పాల్పడిన వారిపై నల్లకుంట, కాచిగూడ పోలీస్ స్టేషన్లలో వేర్వేరుగా కేసులు నమోదయ్యాయి.

# రెడ్లను తిడితే ఊరుకోం

మొదటి పేజీ తరువాయి

వ్యవహరించినాలని తీర్మానం చేశారు. అలాగే ఫార్వర్డ్ కులాలు రిజర్వేషన్లకు వ్యతిరేకం అనే అసత్య ప్రచారాన్ని ఖండించాలని నిర్ణయించారు. ఫార్వర్డ్ కులాలు అంతా బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకమని, వాళ్లను రాజకీయ బహిష్కరణ చేయాలని అపవాదులు వేస్తున్నారని ఇలాంటి వాటిని తిప్పికొట్టాలని తీర్మానించారు. ఏ వర్గానికి నష్టం జరగకుండా భారత రాజ్యాంగానికి, న్యాయస్థానాల తీర్పులకు లోబడి రిజర్వేషన్లు కల్పించాలనేదే ఫార్వర్డ్ కులాల భావన అని తీర్మానించారు. ఇతర కులాలు అన్ని సందర్భాల్లో 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్􀀀ని విమర్శించడం, వ్యతిరేకించడం, ఈడబ్ల్యూఎస్ కు బీసీ రిజర్వేషన్లకు ముడి పెట్టడాన్ని వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని తీర్మానించారు. ఫార్వర్డ్ కులాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తూ కించపరిస్తూ మాట్లాడే ఎవరి మీదనైనా యాక్షన్ తీసుకోవడానికి వీలుగా, ఆర్థికంగా మనలో వెనుకబడిన వారికి చేయూత ఇవ్వడానికి ఈబీసీ కమిషన్, ఈబీసీ కార్పొరేషన్, ఈబీసీ డిపార్ట్మెంట్, ఈబీసీ మినిస్ట్రీ, ఈబీసీ స్టడీ సర్కిల్స్, ఈబీసీ హాస్టల్స్ వంటి స్టాట్యూటరీ ఇన్ స్టిట్యూషన్స్ అవసరంపై తీర్మానం చేశారు. ఫార్వర్డ్ కులాల పేదలకు న్యాయం జరిగే విధంగా తక్షణ నిర్ణయాలు చేయవలసిన అవసరాన్ని వివరిస్తూ గవర్నర్, సీఎం, డీజీపీతో పాటు ఇతర ప్రభుత్వ ఉన్నతాధికారులకు ప్రతినిధి బృందం ద్వారా రిప్రజెంటేషన్ ఇవ్వాలని తీర్మానించారు. ఫార్వర్డ్ కమ్యూనిటీ ఆత్మగౌరవ పరిరక్షణకు ఒక పొలిటికల్ పార్టీ ఏర్పాటు చేసుకోవాలని తీర్మానించారు. ఈబీసీ జాయింట్ యాక్షన్ కమిటీ జాతీయ అధ్యక్షుడు వల్లపు రెడ్డి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. అగ్రకులాల్లో పేదలు ఉన్నారని, మాలో పేదరికానికి కారణం అగ్రకులాల పాలకులేనని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు ఉన్నాయని, వీరికి రిజర్వేషన్లు వద్దనేది తమ వాదన కాదని, కానీ అగ్రవర్ణాల ప్రజలు ఏం పాపం చేశారని ప్రశ్నించారు. అగ్రవర్ణాల్లోనూ అనేక మంది పేదలు ఉన్నారని, వీరిని కూడా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, రాజకీయ పార్టీలకు ఉందన్నారు. కానీ వీరిని విస్మరించి నిరాధారణకు గురి చేస్తున్నారన్నారు. ఈ దుస్థితికి అగ్రకులాల్లోని ప్రజాప్రతినిధులు నాయకులే కారణమని అన్నారు. అగ్రకులాల వారు ఎంత మంది ప్రజాప్రతినిధులు ఉన్నా అగ్రవర్ణాల్లోని పేదలకు చేసిందేమీలేదన్నారు. ట్రిపుల్ టెస్టుకు లోబడి రిజర్వేషన్లు పెంచుకున్నా తమకు అభ్యంతరం లేదని, అంతే తప్ప రాజకీయ పార్టీలు ఒకరిని మించి మరొకరు కులాల జపం చేయడం సరికాదన్నారు.



# మల్లోజుల, ఆశన్న విప్లవ ద్రోహులు

**వారికి ప్రజలే తగిన శిక్ష విధిస్తారు.. మావోయిస్టు కేంద్ర కమిటీ లేఖ**

రాయ్‌పూర్: ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలిసిన మల్లోజుల వేణుగోపాల్ రావు, ఆశన్నపై మావోయిస్టు పార్టీ సీరియస్ అయ్యింది. లొంగుబాట్లపై అభయ్ పేరుతో మావోయిస్టు కేంద్ర కమిటీ 4 పేజీల లేఖ విడుదల చేసింది. విప్లవ ద్రోహులుగా మారి శత్రువుల ఎదుట.. లొంగిపోయిన ఇద్దరికి తగిన శిక్ష ప్రజలే విధిస్తారని కమిటీ తన లేఖలో పేర్కొంది. 'మల్లోజుల (సోను), ఆశన్న (సతీశ్) విప్లవ ద్రోహులుగా మారారు. 2018లో ఒకసారి పార్టీ తాత్కాలిక వెనుకంజ వేసింది. అప్పటి నుంచి మల్లోజుల వేణుగోపాల్ బలహీనతలు బయటపడ్డాయి. 2020 కేంద్రకమిటీ సమావేశంలో మల్లోజుల తప్పుడు భావజాలాన్ని ప్రచారం చేశాడు. ఆయుధాలను వదిలి పెట్టడంపై మల్లోజుల వితండ వాదాన్ని తెరపైకి తెచ్చాడు. కేంద్ర కమిటీతో చర్చించకుండానే మల్లోజుల లొంగిపోయాడు. విప్లవ ద్రోహులు మల్లోజుల వేణుగోపాల్, ఆశన్నలకు తగిన శిక్ష విధించాలని ప్రజలకు పిలుపునిస్తున్నాం. ఇప్పుడు లొంగిపోవడాలు పార్టీకి తాత్కాలిక నష్టం మాత్రమే. ప్రాణ భీతితో ఎవరైనా లొంగిపోతే లొంగిపోవచ్చు కానీ.. పార్టీకి నష్టం కలిగిస్తే ప్రజలే బుద్ధి చెబుతారు' అని మావోయిస్టు కేంద్రకమిటీ అధికార ప్రతినిధి అభయ్ లేఖలో పేర్కొన్నారు.

# నక్సల్స్‌కు కటీఫ్ చెప్పండి

మొదటి పేజీ తరువాయి

పతనం కాక తప్పదు" అని ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదివారం తన శాఖ కార్యాలయాన్ని కర్తవ్య భవన్ లోకి మార్చారు. సెంట్రల్ విస్టా రీ డెవలప్ మెంట్ ప్రాజెక్టులో భాగంగా నూతనంగా నిర్మించిన "కామన్ సెంట్రల్ సచివాలయం" ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ గత ఆగస్టు 6న ప్రారంభించిన సంగతి తెలిసిందే. సుమారు 1.5 లక్షా చదరపు మీటర్ల ప్లింట్ ఏరియా కలిగి ఉన్న ఈ భవనం, రెండు బేస్‌మెంట్‌లతో పాటు 7 అంతస్తులుగా నిర్మించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాతోపాటు సహాయ మంత్రి నిత్యానందరాయ్ కార్యాలయాలు ఇప్పటికే కర్తవ్య భవన్ లోని లెవెల్ 5లోకి మారాయి. దీపావళి సందర్భంగా ఆదివారం మంచి మహూర్తం ఉండటంతో బండి సంజయ్ పూజారుల వేద మంత్రోచ్చారణల కర్తవ్య భవన్ లోకి మధ్య అడుగుపెట్టారు. కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తనకు కేటాయించిన సీట్లో ఆశీసునలయ్యారు.

# 4 రోజులు వానలు

**బంగాళాఖాతంలో అల్పపీడనం**

హైదరాబాద్, అక్టోబర్ 19 (ఈవార్తలు): తెలంగాణలో రాబోయే మూడు నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. దక్షిణ అండమాన్ సముద్రాన్ని ఆనుకొని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని.. దాని ప్రభావంతో మంగళవారం నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. ఇది 48 గంటల్లో పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ దక్షిణ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని ఉందని చెప్పింది. ఈ క్రమంలో ఆదివారం కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. సోమ, మంగళవారాల్లో పలుచోట్లు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. బుధవారం కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో వానలు కురిసే ఛాన్స్ ఉందని వివరించింది.

# అయోధ్య నగరం.. దీపదీపంలో రామనామం

మొదటి పేజీ తరువాయి

వత్తులు, నూనె వేయడం, ఘాట్‌ల వెంట ఆకర్షణీయమైన నమూనాలలో అమర్చడం వంటి పనులలో నిమగ్నమయ్యారు. ఆన్‌లైన్‌లో షేర్ చేసిన వీడియోలు రామ్ కీ పైడీ వద్ద ప్రజలు ఉత్సాహంగా దీపాలు వెలిగిస్తున్న దృశ్యాలను చూపించాయి. సాయంత్రం వేళ, లక్షలాది దీపాల వెలుగు ఒకేసారి మెరుస్తూ, కనువిందు చేసే అద్భుతమైన దృశ్యాన్ని సృష్టించింది. ప్రపంచ రికార్డు నమోదు ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించడానికి, గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ న్యాయనిర్ణేత రిచర్డ్ స్టెన్నింగ్ ఒక వివరణాత్మక ధృవీకరణ వ్యవస్థను ఏర్పాటు చేశారు. 'ప్రతి పాల్గొనేవారి ఎంట్రీని క్యూఆర్ కోడ్‌ల ద్వారా ట్రాక్ చేస్తారు, మరియు ప్రతి జోన్‌ను జాగ్రత్తగా పర్యవేక్షిస్తారు' అని ఆయన తెలిపారు. ఈ మొత్తం ప్రాంతాన్ని అనేక జోన్‌లుగా విభజించారు. ప్రతి జోన్‌లో దీపాలు సరిగ్గా వెలిగించబడ్డాయా, అమర్చబడ్డాయా అని పర్యవేక్షించడానికి ఇద్దరు స్టీవార్డులు బాధ్యత వహించారు. వెలిగించని లేదా తప్పుగా ఉంచిన ఏవైనా దీపాలను మొత్తం లెక్క నుంచి తీసివేయబడుతుందని అధికారులు పేర్కొన్నారు.

# ధరణి దొరల చుట్టం



మొదటి పేజీ తరువాయి

ఆధిపత్యం చెలాయించాలని ప్రయత్నించారని ఆరోపించారు. తమ విజయంలో అనేక కారణాలు ఉన్నప్పటికీ, బీఆర్ఎస్ ఓటమికి ధరణి చట్టమే ప్రధాన కారణమని సీఎం స్పష్టం చేశారు. అధికారంలోకి వస్తే ధరణి నుంచి ప్రజలకు విముక్తి కలిగిస్తామని ఇచ్చిన హామీ మేరకు తమ ప్రభుత్వం ఆ చట్టాన్ని రద్దు చేసి, దాని స్థానంలో 'భూ భారతి' చట్టాన్ని తీసుకొచ్చామని సీఎం తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్లు, పరీక్షలు సక్రమంగా జరగలేదని, ప్రశ్నాపత్రాలు జిరాక్స్ సెంటర్లలో దొరికేవని ఆయన తీవ్రంగా ఆరోపించారు. టీజీపీఎస్సీ పునరావాస కేంద్రంగా మారిందని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి, ఒకే ఏడాదిలో 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, త్వరలో గ్రూప్-3, గ్రూప్-4 అభ్యర్థులకు కూడా నియామకాలు జరుగుతాయని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా లైసెన్స్ పొందిన సర్వేయర్లను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, వారు బాధ్యతాయుతంగా వ్యవహరించి, రైతులకు పూర్తి సహాయం చేయాలని కోరారు. "భూమి సర్వేలో తప్పులు చేస్తే ప్రజలు తిరగబడతారు. భూమి ఆధిపత్యం కోసం గతంలో యుద్ధాలు జరిగాయి, ఇప్పుడు మీరు చేసే సర్వేలు సరిగ్గా ఉండాలి" అని ఆయన గట్టిగా హెచ్చరించారు. భూ భారతి చట్టం ద్వారా భూమి సమస్యలు పరిష్కారమవుతాయని, రైతులకు న్యాయం జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భూ భారతి చట్టం ద్వారా సర్వేయర్ల శిక్షణ, లైసెన్సింగ్ ప్రక్రియలు మెరుగుపడ్డాయని తెలిపారు. తమ ప్రభుత్వం భూమి రికార్డులను డిజిటలైజ్ చేసి, పారదర్శకతను పెంచుతోందని సీఎం ప్రజలకు హామీ ఇచ్చారు. కోర్టుల్లో కేసులు వేసి అపాలని చూస్తున్నా, పోరాడి అభ్యర్థులకు నియామక పత్రాలు అందిస్తున్నామని, పారదర్శక పాలన తమ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

## విద్య, ఉద్యోగవాణి

**బెల్‌లో ఉద్యోగాలు**

మొత్తం పోస్టులు: 176

అర్హత: టెన్త్, ఐటీఐ ఉత్తీర్ణులైనవారు

వయోపరిమితి: 18-28 ఏళ్ల మధ్యగలవారు

దరఖాస్తు చివరి తేదీ: నవంబర్ 04,2025

ఎంపిక విధానం: రాత పరీక్ష ద్వారా

వెబ్‌సైట్: https://bel-indian.in/

**ఇస్రో షార్‌లో పోస్టులు**

మొత్తం పోస్టులు: 141

అర్హత: టెన్త్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ, బీఎస్సీ, బీఈ, బీటెక్, ఎమ్ఈ, ఎంటెక్, బీఎల్ఎస్సీ, నర్సింగ్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి

వయోపరిమితి: 18-35 ఏళ్ల మధ్య కలిగి ఉండాలి

దరఖాస్తు చివరీ తేదీ: నవంబర్ 14,2025

వెబ్‌సైట్:https://www.isro.gov.in/

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికే రెఫరెండం

## రాష్ట్రంలో బుల్డోజర్ పాలన .. కమీషన్ల కోసం మంత్రుల గొడవలు.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 19 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి జరగబోయే ఉపఎన్నిక, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు, శాంతిభద్రతల పరిస్థితికి, విశ్వసనీయతకు ఒక ప్రజా తీర్పు (రెఫరెండం) వంటిదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కీలక అభివృద్ధి ప్రాజెక్టులను నిలిపివేసి, ప్రజలపై బుల్డోజర్ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరితమైన '420 హామీలు' ఇచ్చి ప్రజలను వంచించిందని, వారి నాటకాలను తిప్పికొట్టాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ ఉపఎన్నికలో కాంగ్రెస్ గెలిస్తే, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిగా రద్దు చేసేందుకు వారికి మరింత ధైర్యం వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు. "కాంగ్రెస్‌ను ఓడిస్తేనే, కనీసం కొన్ని హామీలైనా నెరవేర్చాలనే ఒత్తిడి వారిపై ఉంటుంది" అని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో బుల్డోజర్ పాలన, పరిపాలనా గందరగోళం నెలకొన్నాయని కేటీఆర్ ఆరోపించారు. కేవలం ప్రచార ఆర్భాటాలు తప్ప, కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ప్రజా ప్రయోజన కార్యక్రమాన్ని కూడా అమలు చేయలేదని విమర్శించారు. "కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి హైదరాబాద్ పురోగతి, తెలంగాణ సమగ్రాభివృద్ధి పూర్తిగా నిలిచిపోయాయి" అని ఆయన పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను దారుణంగా మోసం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. సరైన రాజ్యాంగబద్ధమైన కసరత్తు లేకుండా చేసిన ప్రకటనలు కోర్టుల్లో నిలబడలేకపోయాయని అన్నారు. బీసీల సాధికారతపై కాంగ్రెస్, బీజేపీలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, పార్లమెంటులో రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదింపజేయాలని ఆయన సవాల్ విసిరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు జాతీయ పార్టీలు చేసే ఎలాంటి నిజాయతీ ప్రయత్నానికైనా రాజ్యసభలో బీఆర్ఎస్ పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. కేబినెట్‌లోని మంత్రులు కమీషన్ల కోసం, అంతర్గత ఆధిపత్యం కోసం



పోరాడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. "మేడారం జాతర పనుల నుంచి టెండర్ల కేటాయింపుల వరకు ప్రతి విషయంలో మంత్రులు వ్యక్తిగత లాభం కోసమే గొడవ పడుతున్నారు. కేబినెట్‌లోనే మంత్రులు ఇలా కమీషన్ల కోసం కొట్టుకుంటుంటే, ఇక రాష్ట్రాన్ని ఎవరు పాలిస్తారు?" అని ఆయన ప్రశ్నించారు. ఎయిర్‌పోర్ట్ మెట్రో ఎక్స్‌ప్రెస్, మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తూ ముఖ్యమంత్రి హైదరాబాద్ భవిష్యత్తుపై నీళ్లు చల్లారని ఆయన విమర్శించారు. ప్రజా రవాణాను పక్కనపెట్టి, కాంగ్రెస్ నేతల భూముల విలువ పెంచడానికే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును తెరపైకి తెచ్చారని ఆరోపించారు.

# బూతులు, తిట్లు రేవంత్‌కు తెలిసిందిదే

### రైతులపై సోయి లేదు.. హరీశ్ రావు ధ్వజం

సిద్దిపేట, అక్టోబర్ 19 (ఈవార్తలు): రేవంత్ రెడ్డికి బూతులు.. ప్రతిపక్షాల మీద తిట్లపై ఉన్న సోయి రైతుల మీద లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. రేవంత్ రెడ్డికి తిట్ల మీద ధ్యాస తప్ప.. పత్తి, మొక్క జొన్న రైతుల తిప్పలు కనపడటం లేదా అని ప్రశ్నించారు. యుద్ధప్రాదిపాదికన కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం గంగాపూర్ రైతులతో హరీశ్‌రావు ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. అధిక వర్షాలు పడి ఇప్పటికే పత్తి రైతులకు దిగుబడి తగ్గి నష్టం వచ్చిందని.. ఉన్న పత్తిని కొనక కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మరింత నష్టం చేస్తుందని తెలిపారు. పత్తి మద్దతు ధర 8వేల 100 ఉంటే ప్రభుత్వం కొనక దళారులకు రైతులు 5వేల 900 లకు అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం పత్తి రైతులకు క్వింటాలుకి 2వేల



రూపాయలు నష్టం కలిగిస్తుందని అన్నారు. రాష్ట్రంలో 6లక్షల ఎకరాలు మొక్క జొన్న సాగు జరిగిందని హరీశ్‌రావు తెలిపారు. మక్కలు మార్కెట్ లో పెట్టుకుని రైతులు పడిగాపులు కాస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే 30%- 40% వరకు రైతులు దళారులకు అమ్ముకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర 2420.. దళారులకు అమ్ముకోవడం వల్ల క్వింటాలుకు 500 రూపాయలు నష్టం కలుగుతుందని చెప్పారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వలన ఎకరానికి రైతులకు రూ. 10వేలు నష్టం వస్తుందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సకాలంలో మక్కలు కొన్నామని.. కానీ ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్‌లో మక్కలు చేతికి అందిన ఫలితం దక్కడం లేదని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రతిపక్షాల మీద నోరు పారేసుకునుడే తప్ప రైతుల మీద పట్టింపు లేదని హరీశ్‌రావు విమర్శించారు. రెండు రైతుబంధులు ఇచ్చిండు%ా% రెండు రైతుబంధులు ఎగ్గొట్టిండని మండిపడ్డారు. సగం ఋణ మాఫీ చేసిండు.. సగం రుణ మాఫీ ఎగొట్టిండని అన్నారు. కౌలు రైతులకు రుణమాఫీ చేస్తా అని మాట తప్పిండని పేర్కొన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఉండేదని.. ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 3గంటల వరకే కరెంట్ ఇస్తున్నాడని తెలిపారు. రైతులకు 11 గంటల కరెంట్ మాత్రమే ఇస్తుందని అన్నారు. తొందరపడి పంటలను దళారులకు అమ్ముకోవద్దని రైతులకు సూచించారు. వెంటనే పత్తి, మొక్కజొన్న కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

# ఆర్టీఏ చెక్‌పోస్టులపై ఏసీబీ దాడులు

### పండుగ టైంలో భారీగా పట్టుబడ్డ అక్రమ నగదు!

హైదరాబాద్, అక్టోబర్ 19 (ఈవార్తలు): దీపావళి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని ఆర్టీఏ చెక్‌పోస్టుల వద్ద అక్రమ వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రంగంలోకి దిగారు. తెలంగాణ వ్యాప్తంగా పలు అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులపై శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు ఏకకాలంలో మెరుపు దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో పలుచోట్ల లెక్కల్లో చూపని భారీ మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నారు. సంగారెడ్డి జిల్లాలోని మద్గి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులతో పాటు ఆదిలాబాద్, కామారెడ్డి, కొమరం భీం జిల్లాల్లోని పలు ఆర్టీఏ చెక్‌పోస్టుల వద్ద ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో భాగంగా కొమరం భీం జిల్లాలోని బోరాజ్ చెక్‌పోస్టులో రూ. 1,26,000, వాంకిడి చెక్‌పోస్టులో రూ. 5,100 అక్రమ నగదును అధికారులు గుర్తించి సీజ్ చేశారు. ఇదే తరహాలో కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం సాలబత్‌పూర్ ఆర్టీవో చెక్‌పోస్టులోనూ సోదాలు జరిగాయి. బిక్కనూరు మండలం పొందుర్తి ఆర్టీఏ చెక్‌పాయింట్ వద్ద ప్రైవేట్ వ్యక్తుల నుంచి రూ. 51,300 స్వాధీనం చేసుకున్నారు. ఇతర ప్రాంతాల్లోనూ మరో రూ. 3,000 పట్టుబడింది. దీపావళి పండుగకు తెలంగాణ నుంచి పొరుగు రాష్ట్రాలకు వెళ్లే వాహనదారుల నుంచి కొందరు సిబ్బంది అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులతో ఏసీబీ ఈ చర్యలు చేపట్టినట్టు తెలుస్తోంది. సరిహద్దు జిల్లాల్లోని చెక్‌పోస్టులపై నిఘాను మరింత కట్టుదిట్టం చేసినట్లు అధికారులు తెలిపారు.

# కానిస్టేబుల్ హంతకుడు అరెస్టు

## నిజామాబాద్‌లో పట్టుకున్న పోలీసులు.. తప్పించుకునే ప్రయత్నం.. పిడిగుద్దులు

నిజామాబాద్, అక్టోబర్ 19 (ఈవార్తలు): నిజామాబాద్‌లో సంచలనం సృష్టించిన కానిస్టేబుల్ హత్య కేసులో నిందితుడు పోలీసులకు చిక్కాడు. రెండు రోజుల క్రితం కానిస్టేబుల్‌ను కత్తితో పొడిచి చంపిన పాత నేరస్థుడు షేక్ రియాజ్‌ను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఓ సామాన్య పౌరుడి సాహసంతో నిందితుడిని పట్టుకోవడం గమనార్హం. నిజామాబాద్ 6వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని సారంగాపూర్ వద్ద రియాజ్ ఉన్నాడన్న పక్కా సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించిన రియాజ్‌ను, అక్కడే ఉన్న ఆసిఫ్ అనే యువకుడు పట్టుకునేందుకు ప్రయత్నించాడు. దీంతో రియాజ్ తన వద్ద ఉన్న కత్తితో ఆసిఫ్‌పై దాడికి తెగబడ్డాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు నిందితుడిని చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. ఈ పెనుగులాటలో రియాజ్, ఆసిఫ్ ఇద్దరికీ గాయాలవడంతో వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని ఎన్‌కౌంటర్ చేశారని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఖండించారు. రియాజ్‌ను ప్రాణాలతోనే పట్టుకున్నామని, అతనిపై కాల్పులు జరిపినట్లు వస్తున్న ప్రచారంలో నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. అక్టోబర్ 17వ తేదీ రాత్రి ఓ బైక్ దొంగతనం కేసులో కానిస్టేబుల్ ఇ. ప్రమోద్ (42), తన మేనల్లుడితో కలిసి రియాజ్‌ను పట్టుకున్నారు. బైక్‌పై తమ మధ్యలో నిందితుడిని కూర్చోబెట్టుకుని తీసుకెళుతుండగా, 24 ఏళ్ల రియాజ్ అకస్మాత్తుగా కత్తితో కానిస్టేబుల్ ప్రమోద్‌పై దాడి చేశాడు. అడ్డుకోబోయిన కానిస్టేబుల్ మేనల్లుడిని కూడా పొడిచాడు. అనంతరం తన స్నేహితుల సహాయంతో అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన ప్రమోద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన డీజీపీ బి. శివధర్ రెడ్డి, నిందితుడిని వెంటనే పట్టుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో నిజామాబాద్ సీపీ సాయి చైతన్య 9 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, రియాజ్ కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. చివరికి రెండు రోజుల వ్యవధిలోనే నిందితుడిని పట్టుకోవడంలో పోలీసులు విజయం సాధించారు.

# డీజీ హోదా దక్కేదెన్నడు?

### ముగ్గురు ఐపీఎస్‌లకు డీజీ హోదా పెండింగ్

### రవిగుప్తా వీఆర్ఎస్‌తో 1995 బ్యాచ్‌కు లైన్ క్లియర్

హైదరాబాద్, అక్టోబర్ 19 (ఈవార్తలు) : రాష్ట్రంలో సీనియర్ ఐపీఎస్‌లుగా ఉన్న 1995వ బ్యాచ్‌కు చెందిన వీవీ శ్రీనివాసరావు, స్వాతిలక్రా, మహేశ్ భగవత్‌లకు డైరెక్టర్ జనరల్(డీజీ) హోదాకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. డీజీ హోదా కలిగిన వారిలో ఇటీవల కాలంలో కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, జితేందర్ ఉద్యోగ విరమణ పొందగా.. రవిగుప్తా వీఆర్ఎస్‌కు



పెట్టుకున్న దరఖాస్తు తాజాగా ప్రభుత్వం ఆమోదించడంతో డీజీ ర్యాంకు కోసం మూడు ఖాళీలు ఏర్పడ్డాయి. దీంతో సీనియర్ల రిటైర్మెంట్ కారణంగా కొన్ని నెలలుగా డీజీ హోదా కోసం ఎదురుచూసిన వారికి లైన్ క్లియర్ అయ్యింది. ఈ క్రమంలో రాష్ట్ర హోంశాఖ కసరత్తు ప్రారంభించినట్టు తెలిసింది. డీజీ హోదాకు అర్హత కలిగిన ఈ ముగ్గురి పేర్లను యూపీఎస్సీకి పంపితే.. వారు పరిశీలించి ఆమోదం తెలిపితే డిసెంబర్‌లోపే డీజీ హోదా రానున్నది. పోలీసుశాఖలో అత్యున్నత హోదా కోసం కొన్ని నెలల పాటు ఎదురుచూస్తున్న వారికి ఇది శుభవార్తనే చెప్పాలి. కానీ వీరి డీజీ హోదా ఫైలు, రెగ్యులర్ డీజీపీ కోసం పంపే ఫైలు ఒకేసారి పంపనున్నట్టు సమాచారం. అలా చేస్తే మాత్రం జనవరి తర్వాతే అనే అని తెలుస్తున్నది. అయితే, పోలీసు శాఖలో రెగ్యులర్ డీజీపీపై చర్చ జరుగుతున్నది. అర్హత ఉన్న అందరి పేర్లను ప్రభుత్వం యూపీఎస్సీకి పంపనున్నది. వారిలో సీనియార్టీ ప్రకారం సీవీ ఆనంద్, వినాయక్ ప్రభాకర్ ఆప్టే, శివధర్‌రెడ్డి, అభిలాష బిస్త్, సౌమ్యామిశ్రా, శిఖాగోయెల్ పేర్లు ఉండనున్నాయి. ఈ ఆరుగురిలో ముగ్గురి పేర్లను ఎంపిక చేసి వారిలో ఒకరిని రెగ్యులర్ డీజీపీగా ఎంపిక చేసుకోవచ్చని రాష్ట్రానికి యూపీఎస్సీ సిఫార్సు చేయనున్నది. యూపీఎస్సీ నుంచి వచ్చే ఆ మూడు పేర్లలో సీనియార్టీ ప్రకారం 1991 బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్, 1994వ బ్యాచ్‌కు శివధర్‌రెడ్డి, అభిలాష బిస్త్ పేర్లు ఉంటాయని తెలిసింది. కాగా, తెలంగాణ క్యాడర్‌కు అలాట్ అయిన వినాయక్ ప్రభాకర్ అప్టే (1994 బ్యాచ్) కేంద్ర సర్వీసుల్లోనే కొనసాతానని మొదట్లోనే స్పష్టంచేశారు. ఇప్పటికే డీజీపీ(కో ఆర్డినేషన్)గా శివధర్‌రెడ్డిని నియమించిన ప్రభుత్వం.. పూర్తిస్థాయి డీజీపీగా నియమించనున్నది. శివధర్‌రెడ్డి కోసమే రవిగుప్తాతో వీఆర్ఎస్ పెట్టించారని చర్చ జరుగుతున్నది.

# జూబ్లీహిల్స్‌లో విష్ణువర్ధన్ రెడ్డి నామినేషన్

### ముందస్తు జాగ్రత్తగా బీఆర్ఎస్ వ్యూహం

జూబ్లీహిల్స్/హైదరాబాద్, అక్టోబర్ 19 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక రాజకీయం రోజురోజుకు వేడెక్కుతోంది. ప్రధాన పార్టీలు ఈ ఎన్నికను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో వ్యూహ ప్రతివ్యూహాలతో ముందుకు సాగుతున్నాయి. ఈ క్రమంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అనుసరిస్తున్న వ్యూహం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. ఎలాంటి రిస్క్ తీసుకోకుండా, బీఆర్ఎస్ ఒకే స్థానానికి ఇద్దరితో నామినేషన్లు దాఖలు చేయించింది. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి గోపీనాథ్ భార్య మాగంటి సునీత పేరును పార్టీ ఇప్పటికే ఖరారు చేసింది. ఆమె పార్టీ తరఫున మూడు సెట్ల నామినేషన్లను కూడా దాఖలు చేశారు. అయితే, ఊహించని పరిణామాలు ఎదురైతే పార్టీకి నష్టం జరగకూడదన్న ఉద్దేశంతో బీఆర్ఎస్ అధిష్ఠానం ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా దివంగత నేత పీజేఆర్ కుమారుడు, మాజీ ఎమ్మెల్యే పి. విష్ణువర్ధన్‌రెడ్డితో కూడా పార్టీ తరఫున నామినేషన్ వేయించింది. సాంకేతిక కారణాలతో లేదా



ఇతర అభ్యంతరాల వల్ల సునీత నామినేషన్ తిరస్కరణకు గురైతే, పార్టీ తరఫున అభ్యర్థి లేకుండా పోయే ప్రమాదాన్ని నివారించేందుకే ఈ ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, అధికార కాంగ్రెస్ పార్టీ కూడా ఈ ఉప ఎన్నికను ఏమాత్రం తేలిగ్గా తీసుకోవడం లేదు. ప్రచారాన్ని హోరెత్తించేందుకు 40 మందితో కూడిన స్టార్ క్యాంపెయినర్ల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో పలువురు మంత్రులు, సీనియర్ నేతలు, ఎమ్మెల్యేలకు చోటు కల్పించింది. ఇటీవల పార్టీలో చేరిన ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు కూడా ఈ ప్రచార బృందంలో స్థానం కల్పించడం గమనార్హం. మొత్తం మీద, ప్రధాన పార్టీలన్నీ జూబ్లీహిల్స్ స్థానాన్ని దక్కించుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డుతుండటంతో ఉప ఎన్నికల వాతావరణం మరింత రసవత్తరంగా మారింది.

# కారు ఢీకొని ముగ్గురి దుర్మరణం

### ఆసిఫాబాద్ జిల్లాలో ఘోర ప్రమాదం

ఆసిఫాబాద్, అక్టోబర్ 19 (ఈవార్తలు):: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆసిఫాబాద్ మండలం మోతుగూడ వద్ద జాతీయ రహదారిపై కారు.. బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. వాంకిడి మండలం బెండారం గ్రామానికి చెందిన ఓ యువకుడు దీపావళి పండుగకు సోదరి, ఆమె పిల్లలను తీసుకెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో జగన్ (27), అక్క అనసూయ(32), ప్రజ్ఞశీల్(4) మృతి చెందారు. మరో పాపకు తీవ్రగాయాలు కావడంతో కాగజ్ నగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అతివేగంగా కారు నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.



# 'జూబ్లీహిల్స్'లో బీఆర్ఎస్ ఓట్ల కుట్ర

### రాజీవ్ సద్భావనా యాత్రలో సీఎం రేవంత్ రెడ్డి

చార్మినార్, అక్టోబర్ 19 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మాటల యుద్ధం మరింత ముదిరింది. విపక్షాలపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ కుట్ర రాజకీయాలకు పాల్పడుతోందని, జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరగబోయే ఉప ఎన్నికలో బీజేపీతో ఆ పార్టీ లోపాయికారీ ఒప్పందం చేసుకుందని తీవ్ర ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ఓట్లను చీల్చేందుకే బీఆర్ఎస్ ఈ ఎత్తుగడ వేస్తోందని ఆయన విమర్శించారు. ఆదివారం చారిత్రక చార్మినార్ వద్ద జరిగిన రాజీవ్ గాంధీ సద్భావనా యాత్ర స్మారక సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీతో బీఆర్ఎస్ రహస్య ఒప్పందం చేసుకుందని ఆయన ఆరోపించారు. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓట్లు 21 శాతం బీజేపీకి బదిలీ కావడమే వారి కుట్ర రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. "ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కూడా బీఆర్ఎస్ అదే రాజకీయ వ్యూహాన్ని అనుసరిస్తోంది" అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఈ రెండు పార్టీల మధ్య పొత్తు రాజకీయాలు కొనసాగుతాయని ఆయన జోస్యం చెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓట్లను చీల్చేందుకు బీఆర్ఎస్ చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, రాజకీయాల్లో యువత కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల కనీస వయసును 21 ఏళ్లకు తగ్గించేలా రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఓటు హక్కు వయసును 18 ఏళ్లకు తగ్గించి దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్య స్ఫూర్తిని బలోపేతం చేశారని గుర్తుచేశారు. దేశ సమగ్రతను కాపాడేందుకు రాజీవ్ గాంధీ చార్మినార్ నుంచి ప్రారంభించిన సద్భావన యాత్ర స్ఫూర్తిని కొనసాగించడానికే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం, కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి సల్మాన్ ఖుర్షీద్‌కు రాజీవ్ గాంధీ సద్భావన పురస్కారాన్ని సీఎం ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ తదితర నేతలు పాల్గొన్నారు.



# శ్రీవారి సేవలో కవిత

### భర్తతో కలిసి దర్శించుకున్న జాగృతి అధ్యక్షురాలు

తిరుమల, అక్టోబర్ 19 (ఈవార్తలు): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత త్వరలో ఒక కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. 'జాగృతి జనం బాట' పేరుతో చేపట్టనున్న ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ఆమె తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి 'జాగృతి జనం బాట' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు కవిత వెల్లడించారు. ఈ కార్యక్రమం సుమారు నాలుగు నెలల పాటు కొనసాగుతుందని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలోనే, కార్యక్రమం ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా పూర్తి కావాలని శ్రీవారిని ప్రార్థించినట్లు ఆమె పేర్కొన్నారు. ఆదివారం ఉదయం తన భర్త అనిల్‌తో కలిసి తిరుమల చేరుకున్న కవిత, వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో స్వామివారి సేవలో పాల్గొన్నారు.



అంతకుముందు ఆలయం వద్దకు చేరుకున్న కవిత దంపతులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వారికి ఆశీర్వచనం అందించి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.



# యాదవుల సహకారం కావాలి

### సదర్ ప్రారంభోత్సవంలో రేవంత్

హైదరాబాద్, అక్టోబర్ 19 (ఈవార్తలు): అభివృద్ధి, సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యంలో యాదవులకు సముచిత స్థానం కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో సదర్ ఉత్సవాన్ని సీఎం ప్రారంభించారు. పదేళ్ల అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం.. సదర్ ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించలేదన్నారు. కాంగ్రెస్ వచ్చాక సదర్ ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ యాదవులకు రాజకీయ అవకాశాలు కల్పించిందని సీఎం తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన ప్రభుత్వంలో యాదవులది అత్యంత కీలకమైన పాత్ర అన్నారు. వారికి మరిన్ని అవకాశాల కోసం పార్టీ పెద్దల దృష్టికి తెస్తామని వివరించారు. హైదరాబాద్ అభివృద్ధికి యాదవుల సహకారం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



# వేములవాడలో శృంగేరి పీఠాధిపతి

**ఘనంగా స్వాగతం పలికిన భక్తజనం**

**ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు**

వేములవాడ,అక్టోబర్ 19 (ఈవార్తలు): శృంగేరి శారదా పీఠాధిపతి భారతీ తీర్థ మహాస్వామికి వేములవాడలో ఘన స్వాగతం లభించింది. ఆయనకు స్వాగతం పలికేందుకు అరటాకులతో స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు చేశారు. పీఠాధిపతి రాక సందర్భంగా.. చెక్కపల్లి బస్టాండ్ నుండి ఆలయం వరకు రోడ్డుకు ఇరువైపులా మహిళలతో పూల వర్షం కురిపించేలా సిద్ధం చేశారు. సాయంత్రం 6 గంటలకు ఆయన రాగానే ఘనస్వాగతం పలికిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఆది శ్రీనివాస్.. దేవస్థానం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. కాగా, సోమవారం 9 గంటలకు రాజన్నను ఆయన దర్శించుకోనున్నారు. అనంతరం భీమేశ్వర ఆలయం పక్కనున్న శృంగేరీ శంకరమఠంలో కుంభాభిషేకం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, కలెక్టర్ ఎం హరిత, ఎస్పీ మహేష్ బి గితే తదితరులు పాల్గొన్నారు.

# బీసీ ఉద్యమం తీవ్రం చేస్తాం

**బీసీ నాయకుడు పొలాస నరేందర్**



వేములవాడ, అక్టోబర్ 19 (ఈవార్తలు): బీసీ బంద్ సక్సెస్‌తో రిజర్వేషన్లకు ప్రజల నుంచి అనుకూల తీర్పు వచ్చిందని, ఇక ఉద్యమాన్ని మరింత తీవ్రం చేస్తామని ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారత సంఘం అధ్యక్షుడు పొలాస నరేందర్ అన్నారు. ప్రజలు, వ్యాపార, వాణిజ్య వర్గాలతో పాటు అన్ని వర్గాలవారు స్వచ్ఛందంగా, సంపూర్ణంగా బీసీ రిజర్వేషన్ల బంద్‌కు మద్దతు తెలిపారని వెల్లడించారు. బీసీ బిల్లుల ఆమోదానికి రాహుల్ గాంధీ పార్లమెంటును స్థంబింపజేయాలని, బీసీలతో ఢిల్లీని దిగ్బంధించాలని, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి చొరవ తీసుకుని అఖిలపక్షాన్ని ప్రధాని,రాష్ట్రపతిని కలిసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. జాప్యం చేస్తే, తెలంగాణ రాష్ట్ర సాధనలా, మరో బీసీ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసి పడుతుందని హెచ్చరించారు.

# ఇండియన్స్ వెళ్లిపోండి

న్యూఢిల్లీ: భారతీయులపై కెనడా కఠినంగా వ్యవహరిస్తున్నది. భారతీయ వలసదారులను బలవంతంగా పంపించేస్తున్నది. 2019 నుంచి వీరి సంఖ్య పెరుగుతూ వస్తున్నది. 2024లో రికార్డు స్థాయిలో భారతీయ వలసదారులను కెనడా నుంచి పంపించేశారు. ఈ ఏడాది ఆ రికార్డు చెరిగిపోయే అవకాశం ఉంది. 2019లో 625 మంది భారతీయులను కెనడా ప్రభుత్వం ఆ దేశం నుంచి బలవంతంగా పంపించేసింది. 2024లో వీరి సంఖ్య మూడు రెట్లకు పెరిగింది. ఈ ఏడాది జూలై 28నాటికి 1,891 మందిని పంపించేసింది. కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ ఇటీవల టొరంటోలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. విదేశీ నేరగాళ్లను దేశం నుంచి పంపించేస్తారా? అని మీడియా అడిగినపుడు కార్నీ స్పందిస్తూ, “ఔను” అని చెప్పారు. మెరుగైన ప్రణాళిక, వనరుల సాయంతో ఈ ప్రక్రియను వేగవంతం చేస్తామని తెలిపారు.



# విజయవాడలో చంద్రబాబు ఆకస్మిక తనిఖీ

విజయవాడ, అక్టోబర్ 19 (ఈవార్తలు): జీఎస్టీ తగ్గింపు నిర్ణయం క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎంతవరకు మేలు చేస్తోంది? ఈ ప్రయోజనాలు సామాన్యులకు అందుతున్నాయా? ఈ విషయాలను స్వయంగా తెలుసుకునేందుకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా జనంలోకి వెళ్లారు. ఆదివారం విజయవాడలోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఒకటైన బీసెంట్ రోడ్‌ను సందర్శించి, అక్కడి వ్యాపారులు, కొనుగోలుదారులతో ముఖాముఖిగా సంభాషించారు. నగర పర్యటనలో భాగంగా, ముఖ్యమంత్రి బీసెంట్ రోడ్‌లోని పలువురు చిరు వ్యాపారులు, వీధి వర్తకులు, జనరల్ స్టోర్ల యజమానులు, చెప్పుల దుకాణాల నిర్వాహకులతో మాట్లాడారు. జీఎస్టీని తగ్గించడం వల్ల వస్తువుల ధరలు వాస్తవంగా తగ్గాయా లేదా అని వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ నిర్ణయంతో వ్యాపారాలు ఎలా సాగుతున్నాయి, ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తోందనే వివరాలను వారి నుంచి సేకరించారు. అదే సమయంలో, షాపింగ్ కోసం బీసెంట్ రోడ్‌కు వచ్చిన కొందరు కొనుగోలుదారులను కూడా ముఖ్యమంత్రి పలకరించారు. ధరల తగ్గుదల వారికి ఏ మేరకు ప్రయోజనం చేకూరుస్తోందనే దానిపై వారి అభిప్రాయాలను కూడా అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి నేరుగా తమ వద్దకు వచ్చి మాట్లాడటంతో వ్యాపారులు, స్థానికులు ఉబ్బితబ్బిబ్బయ్యారు.

# జోగి రమేశ్ అరెస్ట్ ఖాయం

**కల్తీ మద్యం కేసులో అతడే సూత్రధారి: బుద్ధా వెంకన్న**

అమరావతి, అక్టోబర్ 19 (ఈవార్తలు): ఏపీ రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేష్‌పై టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన కల్తీ మద్యం కేసులో ప్రధాన సూత్రధారి జోగి రమేశ్ అని, ఈ కేసులో అతడు అరెస్ట్ కావడం ఖాయమని బుద్ధా వెంకన్న జోస్యం చెప్పారు. ఓ ప్రముఖ టీవీ ఛానల్‌లో జరిగిన చర్చా కార్యక్రమంలో జోగి రమేశ్ చేసిన వ్యాఖ్యలను వెంకన్న ఈ మేరకు తిప్పికొట్టారు. చర్చా కార్యక్రమంలో బుద్ధా వెంకన్న మాట్లాడుతూ, “కల్తీ మద్యం తయారీ వెనుక ఉన్నది జోగి రమేశే. ఆయన ఆదేశాల ప్రకారమే ఇదంతా జరిగింది. ఈ విషయాన్ని ఇప్పటికే విచారణలో నిందితుడు జనార్ధన్‌రావు అంగీకరించారు. సాక్ష్యాధారాలు స్పష్టంగా ఉన్నాయి, అందుకే జోగి రమేశ్ ను అరెస్ట్ చేయడం ఖాయం” అని అన్నారు. జోగి రమేశ్ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు అసత్యాలు మాట్లాడుతున్నారని, అతడి మాటలను ఎవరూ నమ్మే స్థితిలో లేరని విమర్శించారు. అతడి రాజకీయ జీవితం మొత్తం అక్రమాలతోనే నిండిపోయిందని ఆరోపించారు. అంతటితో ఆగకుండా, జోగి రమేశ్ ఆర్థిక అక్రమాలపై కూడా బుద్ధా వెంకన్న తీవ్ర వ్యాఖ్యలు చేశారు. “జోగి రమేశ్ వందల కోట్ల రూపాయల ఆస్తులు ఎలా సంపాదించారు? అగ్రిగోల్డ్ బాధితులను బెదిరించి వారి ఆస్తులను బలవంతంగా రాయించుకున్నారు. ఆయన అవినీతి గురించి మాట్లాడాలంటే ఎంతో ఉంది” అంటూ విరుచుకుపడ్డారు. ప్రజల సొమ్మును దోచుకున్న వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఇదే సమయంలో, గతంలో చంద్రబాబు నివాసం వద్ద జరిగిన నిరసన ఘటనపైనా వెంకన్న స్పందించారు. “ప్రశాంతంగా నిరసన తెలిపే వాళ్లు చేతుల్లో రాళ్లు పట్టుకుని ఎందుకు వెళ్తారు? అది నిరసన కాదు, స్పష్టంగా దాడి చేసేందుకే వెళ్లారు. ఇదే తరహాలో మేము కూడా జగన్ ఇంటికి రావాలా?” అని ప్రశ్నించారు. ఆనాడు ఒక మాజీ ముఖ్యమంత్రి ఇంటిపై దాడికి ప్రయత్నించడం హేయమైన చర్య అని ఆయన అభివర్ణించారు. టీవీ ఛానల్లో జోగి రమేశ్ చేసిన అసత్య ప్రచారానికి ప్రతిస్పందనగానే తాను ఈ విషయాలు చెప్పాల్సి వస్తోందని బుద్ధా వెంకన్న స్పష్టం చేశారు. ఈ ఆరోపణలు, ప్రత్యారోపణలతో ఇరు పార్టీల మధ్య రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.

# 500 కోట్ల స్కామ్‌లో కేరళ బీజేపీ అధ్యక్షుడు

**కర్ణాటక భూ కుంభకోణంలో రాజీవ్ చంద్రశేఖర్ పేరు**



బెంగళూరు: రూ.500 కోట్ల స్కామ్‌లో కేరళ బీజేపీ చీఫ్ రాజీవ్ చంద్రశేఖర్ పేరు బయటకు రావడం రాజకీయంగా సంచలనంగా మారింది. కర్ణాటకలో ఈ భూ కుంభకోణం వెలుగుచూసింది. బీపీఎల్ ఇండియా లిమిటెడ్‌కు పారిశ్రామిక అవసరాల కోసం కర్ణాటక ఇండస్ట్రియల్ ఏరియాస్ డెవలప్‌మెంట్ బోర్డ్ (కేఐఏడీబీ) కేటాయించిన భూమిలో పరిశ్రమలు స్థాపించకుండా వందల కోట్ల రూపాయలకు అమ్ముకున్నారు. దీనిపై ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణను ప్రారంభించింది. బీజేపీ నేత రాజీవ్ చంద్రశేఖర్, అతని భార్య అంజు చంద్రశేఖర్, అజిత్ గోపాల్ నంబియార్, బీజేపీ నేత, మాజీ మంత్రి కట్టా సుబ్రహ్మణ్య నాయుడు పాల్పడిన భూ దందాపై కర్ణాటక ప్రభుత్వం విచారణ చేయాలంటూ ఢిల్లీకి చెందిన న్యాయవాది కేఎన్ జగదీశ్ కుమార్ పిటిషన్ దాఖలు చేశారు. ఆయన బీపీఎల్ ఇండియాను కూడా తన పిటిషన్‌లో లక్ష్యంగా చేసుకున్నారు. కాగా, అంజు చంద్రశేఖర్ బీపీఎల్ గ్రూప్ వ్యవస్థాపకుడు టీపీజీ నంబియార్ కుమార్తె. నేలమంగళ, దొబ్బాస్పేట్‌లో టీవీ, కలర్ ట్యూబ్‌లు, బ్యాటరీలు తయారు చేసే యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు 175 ఎకరాల వ్యవసాయ భూమిని బీపీఎల్‌కు కేఐఏడీబీ 1995లో కేటాయించింది. ఆ భూమిలో 2004 వరకు ఎలాంటి పారిశ్రామిక యూనిట్‌లు ఏర్పాటు చేయలేదు. అయితే 1995లోనే కేఐఏడీబీ 149 ఎకరాలకు సంబంధించిన స్వాధీన డాక్యుమెంట్లను బీపీఎల్‌కు ఇచ్చేసింది. 1996 ఏప్రిల్‌లో అజిత్ గోపాల్ నంబియార్, అంజు రాజీవ్ చంద్రశేఖర్‌లు ఆ భూమిని తనఖా పెట్టి రుణాలు పొందారు. తర్వాత అప్పటి బీజేపీ మంత్రి కట్టా సుబ్రహ్మణ్య నాయుడు సహకారంతో ఆ భూమిని అమ్మే హక్కును కూడా పొందారు. అనంతరం దానిని ముక్కలు ముక్కలుగా చేసి పలు సంస్థలకు అమ్మేశారు. 2011లోనే 87 ఎకరాలను 275 కోట్ల రూపాయలకు అమ్మేశారు. ఈ భారీ భూ కుంభకోణంపై కర్ణాటక ప్రభుత్వం వెంటనే విచారణ జరపాలని న్యాయవాది కేఎన్ జగదీశ్ కుమార్ కోరారు.

# బీహార్‌లో 6 చోట్ల జేఎంఎం పోరు

పాట్నా: ఇండియా కూటమిలో లుకలుకలు మొదలయ్యాయా?.. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల పంపకాలపై చిచ్చు రేగిందా?.. అంటే అవుననే జవాబు వినిపిస్తోంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి పార్టీలు మహా ఘట్ బంధన్ గా ఏర్పడి బరిలోకి దిగుతున్నాయి. అయితే, ఈ కూటమిలో సీట్ల పంపకంపై చర్చలు ఓ పట్టానా కొలిక్కి రావడంలేదని సమాచారం. ప్రాంతీయ పార్టీగా రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) కూటమిలో కీలకంగా వ్యవహరిస్తుండగా.. జాతీయ పార్టీగా తమకు తగిన ప్రాధాన్యం దక్కాలని కాంగ్రెస్ పట్టుబడుతోంది. పొత్తు ధర్మంలో భాగంగా తమకు 61 సీట్లు కావాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, తేజస్వీ యాదవ్ లతో ఇటీవల ఢిల్లీలో కాంగ్రెస్ హైకమాండ్ చర్చలు జరిపింది. ఈ చర్చలు ఎటూ తేలకపోవడంతో ఆర్జేడీ తన అభ్యర్థులను ప్రకటించి, వారితో నామినేషన్లు కూడా దాఖలు చేయించింది. ఇదిలా ఉండగా.. ఇండియా కూటమిలోని మరో పార్టీ జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) కూడా బీహార్ అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగింది. తమకు పన్నెండు సీట్లు కావాలని జేఎంఎం అధినేత, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం.

# గురుకుల పార్ట్‌టైమ్ టీచర్లకు ఊరట

అమరావతి, అక్టోబర్ 19 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లోని బాలయోగి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులకు ఏపీ హైకోర్టు స్వల్ప ఊరట కల్పించింది. ఈ ఉపాధ్యాయులను విధులనుంచి తొలగించరాదని, తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు వారికి ఉద్యోగాల్లో ఎటువంటి ఆటంకం కలిగించవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ న్యాపతి విజయ్ ఈ కేసును విచారించారు. సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి, గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి, వివిధ జిల్లాల కోఆర్డినేటర్లు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లకు న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నవంబర్ 17కి వాయిదా వేసింది. వివిధ జిల్లాలకు చెందిన 24 మంది పార్ట్ టైమ్ ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించారు. 2009 నుంచి నిరంతరంగా పనిచేస్తున్న తమ సేవలను ప్రభుత్వం క్రమబద్ధీకరించకపోవడమే కాకుండా, ఇటీవల విధులకు హాజరుకావద్దని అధికారులు మౌఖికంగా చెప్పారని వారు వాదించారు. తమ సర్వీసును గుర్తించి శాశ్వత ఉద్యోగులుగా మార్చాలని పిటిషనర్లు కోరారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది కర్రా మాధవి వాదనలు వినిపిస్తూ.. “హైకోర్టు ఇప్పటికే ఫిబ్రవరి 12న ప్రభుత్వం పిటిషనర్ల సేవలను క్రమబద్ధీకరించే అంశాన్ని పరిశీలించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. కానీ అధికారులు వాటిని పట్టించుకోలేదు. అంతేకాకుండా, విధులకు హాజరుకావొద్దని మౌఖిక ఆదేశాలు ఇవ్వడం చట్ట విరుద్ధం” అని తెలిపారు. ఇక ప్రభుత్వ తరఫున స్టాండింగ్ కౌన్సెల్ రవికుమార్, ప్రభుత్వ సహాయ న్యాయవాది వాదిస్తూ, “పార్ట్ టైమ్ టీచర్ల నియామకం కేవలం స్టాప్ గ్యాప్ అరేంజ్‌మెంట్ భాగంలో జరిగింది. కొనసాగించాలనే హక్కు పిటిషనర్లకు లేదు” అని పేర్కొన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని కోరారు. కోర్టు ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం, పిటిషనర్ల విధులకు ఎటువంటి ఆటంకం కలిగించరాదని తాత్కాలిక ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను నవంబర్ 17కి వాయిదా వేసింది.

# బీహార్‌లో ఎన్డీయే ఓటమి తథ్యం

**మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు**

**కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్‌కు హాజరు**

పాట్నా: బీహార్ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆర్జేడీ, వామపక్షాలతో కూడిన ‘మహాగట్బంధన్’ కూటమి ఘన విజయం సాధించడం ఖాయమని తెలంగాణ మంత్రి, కాంగ్రెస్ బీహార్ ఎన్నికల పరిశీలకుడు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, ఈసారి ప్రజలు ఆ కూటమిని తిరస్కరించడం ఖాయమని జోస్యం చెప్పారు. నిన్న ఆయన పశ్చిమ చంపారన్ జిల్లాలోని నూతన్ అసెంబ్లీ నియోజకవర్గంలో పర్యటించారు. అక్కడ మహకూటమి తరఫున పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి అమిత్ గిరి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ, నితీశ్–బీజేపీ ప్రభుత్వం మాటలకే పరిమితమైందని, వారిది అసమర్థ పాలన అని విమర్శించారు. రాష్ట్రంలో పెరిగిపోయిన నిరుద్యోగం వల్ల యువత తీవ్ర నిరాశలో ఉందని, ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. “దక్షిణాది రాష్ట్రాల్లో ఎక్కడ చూసినా బీహార్ యువకులే కనిపించడానికి ఇదే కారణం.

# పున్నమిఘాట్‌లో దీపావళి వేడుకలు

**సతీసమేతంగా హాజరైన చంద్రబాబు**



విజయవాడ, అక్టోబర్ 19 (ఈవార్తలు): రాబోయే పదేళ్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో ఆంధ్రప్రదేశ్‌లో ఊహించని అభివృద్ధిని సాధించి చూపిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. టెక్ దిగ్గజం గూగుల్ రాష్ట్రంలో 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చిందని, భవిష్యత్తులో ఏఐకి ఏపీ చిరునామాగా మారితే, విశాఖపట్నం దాని ప్రధాన కేంద్రంగా (హెడ్‌క్వార్టర్‌గా) ఎదుగుతుందని ఆయన స్పష్టం చేశారు. విజయవాడలోని పున్నమి ఘాట్‌లో ఆదివారం ‘సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ’ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన దీపావళి వేడుకలకు ఆయన తన అర్ధాంగి భువనేశ్వరితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టామని అన్నారు. గతంలో వెంటిలేటర్‌పై కొట్టుమిట్టాడుతున్న రాష్ట్రాన్ని డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి పథంలోకి తీసుకొచ్చామని తెలిపారు. జీఎస్టీ సంస్కరణల ద్వారా ప్రతి కుటుంబానికి ఏటా సుమారు రూ.15 వేల వరకు ఆదా అవుతోందని వివరించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదలకు అండగా నిలుస్తున్నామని ఆయన పేర్కొన్నారు. గత ఐదేళ్ల పాలనపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. నరకాసురుడిని వధించిన రోజునే దీపావళి జరుపుకుంటామని గుర్తుచేస్తూ, 2019–24 మధ్య రాష్ట్రాన్ని పట్టి పీడించిన రాక్షసుడిని ప్రజలు తమ ఓటుతో ఓడించారని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో మళ్లీ వైకుంఠపాళి ఆటలు వద్దని, అలాంటివి పునరావృతమైతే రాష్ట్రం సర్వనాశనమవుతుందని హెచ్చరించారు. రాజకీయ మూర్ఖత్వంతో కొందరు ఇష్టానుసారంగా మాట్లాడతారని, అలాంటి వారి మాటలను ప్రజలు నమ్మవద్దని ఆయన విమర్శించారు. రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టును 2027 జూన్ లేదా డిసెంబర్ నాటికి పూర్తి చేసి చూపిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అదేవిధంగా, నిలిచిపోయిన అమరావతి నిర్మాణ పనులు తిరిగి పట్టాలెక్కాయని, రాబోయే మూడేళ్లలో రూ.60 వేల కోట్ల విలువైన పనులను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. స్వర్ణాంధ్ర ప్రదేశ్‌ను దేశంలోనే నంబర్ వన్‌గా నిలబెట్టడమే తన లక్ష్యమని, అప్పుడు ప్రతి పేద కుటుంబం ఉన్నత స్థితికి చేరుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు విజయవాడలో శని, ఆదివారాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నన్ను జైలుకు పంపే కుట్ర

**వైసీపీ నేత జోగి రమేశ్**




విజయవాడ, అక్టోబర్ 19 (ఈవార్తలు): ఏపీవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న నకిలీ మద్యం కేసులో తనపై వస్తున్న ఆరోపణలపై వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్ తీవ్రస్థాయిలో స్పందించారు. ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్య అని, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ కేసులో తన పేరును ఇరికిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ కేసులో తాను ఎలాంటి విచారణకైనా సిద్ధమని, అవసరమైతే లై డిటెక్టర్ పరీక్షకు కూడా వస్తానని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. తనను అన్యాయంగా జైలుకు పంపాలనే ఏకైక లక్ష్యంతోనే ఈ కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. మీడియాతో మాట్లాడిన జోగి రమేశ్, ప్రభుత్వంపై పలు సూటి ప్రశ్నలు సంధించారు. “నకిలీ మద్యం కేసులో నన్ను ఇరికించాలని చూస్తున్నారు. నేను ఏ విచారణకైనా సిద్ధంగా ఉన్నాను. మీరు చెప్పిన చోటికి లై డిటెక్టర్ పరీక్షకు కూడా వస్తాను. కానీ, ఈ కేసులో మీరు సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు చాలా ఉన్నాయి” అని అన్నారు. కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అద్దేపల్లి జనార్దన్‌ను ప్రభుత్వం రెడ్ కార్పెట్ వేసి పిలిపించి, అతనితో బలవంతంగా తన పేరు చెప్పించిందని ఆరోపించారు. అసలు పోలీస్ కస్టడీలో ఉన్న నిందితుడి వీడియో బయటకు ఎలా లీక్ అయిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జనార్దన్, జయచంద్రారెడ్డి స్నేహితులని స్వయంగా చంద్రబాబే గతంలో చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. మద్యం వ్యాపారంతో సంబంధం ఉన్న వ్యక్తికి టీడీపీ టికెట్ ఎలా ఇచ్చిందని జోగి రమేశ్ నిలదీశారు. “తంబళ్లపల్లె నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన జయచంద్రారెడ్డికి మద్యం వ్యాపారం ఉందని మీకు తెలియదా? తెలిసీ అతనికి టికెట్ ఎలా ఇచ్చారు? దీని వెనుక ఎలాంటి సూట్‌కేస్ ఒప్పందాలు జరిగాయి?” అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో నిజాయతీ ఉంటే చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మంచి నీటి కుళాయిల కంటే బెల్టు షాపులే ఎక్కువగా ఉన్నాయని, ప్రభుత్వ మద్యం పాలసీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని విమర్శించారు. ఈ కేసులో తనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి తాను ఎక్కడైనా ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నానని జోగి రమేశ్ స్పష్టం చేశారు. “నేను తిరుమల వెంకన్న లేదా బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో ప్రమాణం చేస్తాను. అవసరమైతే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటికి వచ్చి అయినా ప్రమాణం చేయడానికి సిద్ధం. నాపై బురద జల్లాలనే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారు. వ్యవస్థలను అడ్డం పెట్టుకుని దుర్మార్గమైన రాజకీయాలు చేయడం మానుకోవాలి” అని హితవు పలికారు. తనపై చేస్తున్న ఆరోపణలను నిరూపించలేకపోతే చంద్రబాబు, లోకేశ్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్యే టికెట్ ఇవ్వలేదని..

# కుర్తా చించుకుని రోడ్డుపై పడి ఏడ్చిన ఆర్జేడీ నేత



పాట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ విపక్ష మహాకూటమి టిక్కెట్ల పంపకాల పంచాయతీ ఇంకా కొలిక్కి రాకుండానే అభ్యర్థుల జాబితాలు వెలువడుతుండటం గందరగోళం సృష్టిస్తోంది. దీంతో టిక్కెట్లు దక్కని నేతలు ఘొల్లుమంటున్నారు. తాజాగా పాట్నాలోని లాలూ ప్రసాద్ యాదవ్ నివాసం వద్ద హైడ్రామా చోటుచేసుకుంది. మధుబన్ అసెంబ్లీ నుంచి టిక్కెట్ ఆశించిన ఆర్జేడీ నేత మదన్ షా తనకు టిక్కెట్ దక్కకపోవడంతో లాలూ నివాసం బయట కుర్తా చింపుకుని, నేలపై పడుకుని గుక్కపెట్టి ఏడుపు అందుకున్నాడు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. తాను ముడుపులు ఇవ్వకపోవడం వల్లే టిక్కెట్ నిరాకరించినట్టు షా ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులకు టిక్కెట్లు ఇచ్చే బ్రోకర్‌గా రాజ్యసభ ఎంపీ సంజయ్ యాదవ్ వ్యవహరించారంటూ ఆరోపించారు. తనకు బదులు బీజేపీ ఏజెంట్ డాక్టర్ సంతోష్ కుష్వాహకు టిక్కెట్ ఇచ్చారని, పార్టీనే నమ్ముకుని పనిచేసిన వారికి డబ్బుల్లేవనే కారణంగా టిక్కెట్లు నిరాకరిస్తున్నారని తెలిపారు. లాలూతో ఎంతోకాలంగా పనిచేశానని, ఆయన తన గురువు అని షా చెప్పారు. మధుబని నుంచి తనకు గెలుపు తథ్యమని కమ్యూనిటీ సర్వేలో తేలడంతో తనకు టిక్కెట్ ఇస్తానని లాలూ ప్రసాద్ హామీ ఇచ్చారని తెలిపారు. 1990 నుంచి పార్టీలో పనిచేస్తున్నానని, తన రాజకీయ కెరీర్ కోసం భూమిని కూడా అమ్ముకున్నానని ఆయన వాపోయారు. తేజస్వి అహంభావి అని, ఆయన ప్రజలను కలవరని విమర్శించారు. ‘టిక్కెట్లన్నీ ఇచ్చేశారు. ఇదంతా సంజయ్ యాదవ్ చేశారు. నేను చనిపోయేందుకు ఇక్కడకు వచ్చారు. లాలూ యాదవ్ నా గురువు. టిక్కెట్ ఇస్తామని చెప్పారు. కానీ బీజేపీ ఏజెంట్ సంతోష్ కుష్వాహకు ఇచ్చేశారు’ అని భోరున విలపించారు. లాలూ ఇంటిముందు గందరగోళం తలెత్తడంతో సెక్యూరిటీ సిబ్బంది షాను అక్కడి నుంచి తరలించారు.




# లక్ష కార్లు సేల్

ఒకే రోజు 10 వేల కోట్ల వ్యాపారం

ధన త్రయోదశి వేల భారీగా బిజినెస్

అదరగొట్టిన టాటా, హ్యుందాయ్, మారుతీ సుజుకీ

న్యూఢిల్లీ/ముంబై/హైదరాబాద్: ధనత్రయోదశి పర్వదినం భారత ఆటోమొబైల్ మార్కెట్లో సరికొత్త రికార్డులు సృష్టించింది. పండగ కళతో కేవలం 24 గంటల వ్యవధిలో దేశవ్యాప్తంగా లక్షకు పైగా కార్లు డెలివరీ అయ్యాయి. పరిశ్రమ వర్గాల అంచనా ప్రకారం, ఈ అమ్మకాల విలువ ఏకంగా రూ. 8,500 కోట్ల నుంచి రూ. 10,000 కోట్ల వరకు ఉంటుందని తెలుస్తోంది. పండగ సీజన్‌లో పెరిగిన డిమాండ్, జీఎస్టీ 2.0 సంస్కరణలు తెచ్చిన సానుకూల వాతావరణం ఈ అమ్మకాల జోరుకు ప్రధాన కారణంగా నిలిచాయి. మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, హ్యుందాయ్ మోటార్ ఇండియా వంటి దిగ్గజ సంస్థలు భారీ అమ్మకాలతో పండగను ఘనంగా జరుపుకున్నాయి. వినియోగదారుల్లో పెరిగిన కొనుగోలు శక్తి, ఆత్మవిశ్వాసం ఈ రికార్డులకు బాటలు వేశాయి. ఈ అమ్మకాలపై టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ అమిత్ కామత్ మాట్లాడుతూ, "ఈ ఏడాది మంచి ముహూర్తాల కారణంగా ధనత్రయోదశి, దీపావళి డెలివరీలు రెండు మూడు రోజుల పాటు కొనసాగాయి. మార్కెట్లో డిమాండ్ చాలా బలంగా ఉంది. ఈ పండగ సీజన్‌లో మేము 25,000 పైగా వాహనాలను డెలివరీ చేయాలని భావిస్తున్నాం" అని తెలిపారు. ఇదే తరహా అభిప్రాయాన్ని హ్యుందాయ్ మోటార్ ఇండియా సీఓఓ తరుణ్ గార్గ్ వ్యక్తం చేశారు. "వినియోగదారుల నుంచి బలమైన స్పందన లభించింది. గతేడాదితో పోలిస్తే సుమారు 20 శాతం అధికంగా, దాదాపు 14,000 వాహనాలను డెలివరీ చేయనున్నాం" అని అన్నారు. ఈ పండగ ఉత్సాహం కేవలం వాహన రంగానికే పరిమితం కాలేదు. బంగారం, వెండి అమ్మకాలు కూడా విలువ పరంగా 25 శాతానికి పైగా పెరిగాయి. ఆల్ ఇండియా జెమ్ అండ్ జ్యువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ ప్రకారం, బంగారం ధరలు తగ్గడంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఈ సీజన్‌లో నగల అమ్మకాలు రూ. 50,000 కోట్లు దాటుతాయని జీజేసీ ఛైర్మన్ రాజేశ్ రోక్డే అంచనా వేశారు. మొత్తంగా, ధనత్రయోదశి రోజున దేశంలో జరిగిన వ్యాపారం రూ. 1 లక్ష కోట్లు దాటినట్లు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ అంచనా వేసింది. మొత్తం మీద, పండగల జోష్, మెరుగుపడిన ఆర్థిక పరిస్థితులు, పన్ను సంస్కరణలు కలిసి ఈ ఏడాది రిటైల్ మార్కెట్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఇటీవలి కాలంలో ఇంతటి సానుకూల వాతావరణం ఇదేనని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## భారతీయులను గెంటేయాలి

**అమెరికా నేత విద్వేష వ్యాఖ్యలు**

న్యూయార్క్: భారతీయులు ఎవరూ అమెరికా గురించి ఆలోచించరని ఆరోపిస్తూ వారందరినీ వెనక్కి పంపించేయాలని అమెరికా రాజకీయ నేత చాండ్లర్ లాంగేవిన్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ప్రస్తుతం ఈ భారత సంతతి అమెరికన్లతో పాటు అమెరికన్లలోనూ వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అమెరికాలో విద్వేషానికి చోటులేదని, చాండ్లర్ వ్యాఖ్యలు విద్వేషపూరితమైనవేనని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫ్లోరిడాకు చెందిన చాండ్లర్ లాంగేవిన్ స్థానిక పామ్ బే సిటీ కౌన్సిల్‌కు చెందిన కన్జర్వేటివ్ నాయకుడు. ఈ వివాదాస్పద పోస్టు నేపథ్యంలో చాండ్లర్ పై పామ్ బే సిటీ కౌన్సిల్ చర్యలు తీసుకుంది. గత నెలలో ఓ భారతీయ ట్రక్ డ్రైవర్ చేసిన ప్రమాదంలో అమెరికన్ మహిళ ప్రాణాలు కోల్పోయింది. ఈ వార్తను సోషల్ మీడియాలో పంచుకుంటూ.. అమెరికాలోని భారతీయులందరినీ వెంటనే బహిష్కరించాలని చాండ్లర్ పోస్ట్ చేశారు. భారతీయులు అమెరికాను అస్సలు పట్టించుకోరని, వారు మనల్ని ఆర్థికంగా దోచుకుంటున్నారని చాండ్లర్ తన పోస్టులో పేర్కొన్నారు. అమెరికా కేవలం అమెరికన్ల కోసమేనని మరో పోస్టులో వ్యాఖ్యానించారు. తన పుట్టిన రోజు సందర్భంగా చాండ్లర్ సోషల్ మీడియాలో పెట్టిన మరో పోస్టులో.. 'నా పుట్టినరోజు సందర్భంగా అమెరికాలోని ప్రతీ భారతీయుడినీ బహిష్కరించాలని కోరుకుంటున్నా' అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ను ట్యాగ్ చేశారు. చాండ్లర్ తన పోస్టుల్లో భారతీయులపై విద్వేషం వెల్లగక్కడంపై సిటీ కౌన్సిల్ కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ప్రజలతో పాటు స్థానికులు కూడా పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో చాండ్లర్ ను కమిటీ నుంచి తప్పిస్తూ సిటీ కౌన్సిల్ చర్యలు తీసుకుంది. ఇకపై ఆయన ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదని ఆదేశించింది.






# అమెరికాలో నో కింగ్స్

**ట్రంప్‌కు వ్యతిరేకంగా నిరసనలు**

**50 రాష్ట్రాల్లోని 2,500 ప్రాంతాల్లో నిరసనలు**

వాషింగ్టన్: రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన దూకుడు విధానాలతో దేశవ్యాప్తంగా మరోసారి చర్చనీయాంశమయ్యారు. సంస్కరణల పేరుతో ఊహించని నిర్ణయాలు తీసుకుంటూ వరుసగా ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లను జారీ చేస్తున్నారు. ఈ చర్యలతో ట్రంప్ పాలనపై అమెరికాలో, అంతర్జాతీయంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఆయనను "నిరంకుశ పాలకుడు"గా అభివర్ణిస్తూ అమెరికన్లు మరోసారి వీధుల్లోకి వచ్చారు. 'నో కింగ్స్' పేరుతో దేశవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చిన పౌర సంఘాలు ట్రంప్ విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. యాభై రాష్ట్రాల్లో దాదాపు 2,500 ప్రాంతాల్లో ఈ ఆందోళనలు జరుగుతుండగా, పలు యూరోపియన్ దేశాలు కూడా ట్రంప్ వ్యతిరేక నిరసనలకు మద్దతు తెలుపుతున్నాయి. అమెరికాలో రాజులు లేరు, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి అని ఉద్యమ నిర్వాహకులు పేర్కొన్నారు. ట్రంప్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో దుమ్మెత్తి పోస్తున్నారు. పాలనా సంస్కరణల పేరుతో ఎలాన్ మస్క్ నేతృత్వంలో "డోజ్" అనే ప్రత్యేక సంస్కరణ కమిటీని ఏర్పాటు చేసిన ట్రంప్ ప్రభుత్వం వేలాది మంది ఉద్యోగులను తొలగించింది. జన్మతః పౌరసత్వం, ట్రాన్స్ జెండర్ హక్కులు, అక్రమ వలసలు వంటి అంశాల్లో కీలక మార్పులు తీసుకువచ్చిన ట్రంప్ యంత్రాంగం వలసదారులపై తీవ్ర చర్యలు ప్రారంభించింది. ఈ క్రమంలో వలసదారుల ఇళ్లలో సోదాలు, అరెస్టులు జరగడం, నిరసనకారులను అణిచివేసేందుకు జాతీయ బలగాలను మోహరించడం పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేసింది. ఇదివరకే ట్రంప్ జూన్‌లో నిర్వహించిన మిలిటరీ పరేడ్ సమయంలో దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగాయి. సెనెట్ నేత చక్ షుమెర్, బెర్నీ సాండెర్స్ వంటి ప్రముఖ రాజకీయ నాయకులు కూడా ఈ నిరసనల్లో పాల్గొన్నారు. ఇక, ఇటీవల అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా మూడు వారాలుగా అనేక ప్రభుత్వ సేవలు నిలిచిపోయాయి. లక్షలాది మంది ఉద్యోగులపై షట్ డౌన్ ప్రభావం చూపుతోంది. ఈ పరిణామాలు ప్రజల్లో మరింత ఆగ్రహాన్ని రగిలించినట్లు తెలుస్తోంది. ఈ నిరసనలపై వైట్‌హౌస్ స్పందిస్తూ, "ఇవి కేవలం 'హేట్ అమెరికా' ర్యాలీలే. దేశానికి వ్యతిరేకంగా ఉన్నవారు వీటిని ప్రోత్సహిస్తున్నారు" అని పేర్కొంది. ట్రంప్ స్వయంగా మాట్లాడుతూ, "నన్ను రాజుగా అంటున్నారు కానీ నేను రాజును కాదు. నేను ప్రజల తరఫున పనిచేస్తున్న అధ్యక్షుడిని" అని అన్నారు. తాజా నిరసనల నేపథ్యంలో పలు రాష్ట్రాల గవర్నర్లు అప్రమత్తమయ్యారు. ముందస్తు చర్యగా జాతీయ బలగాలను రంగంలోకి దించారు. పలు ప్రాంతాల్లో నిరసనకారులు ట్రంప్‌కు వ్యతిరేకంగా నినాదాలతో ర్యాలీలు నిర్వహిస్తున్నారు.

## యూఎస్‌లో డ్రగ్స్ సబ్‌మెరైన్ పేల్చివేత


వాషింగ్టన్: కరేబియన్ సముద్రంలో కలకలం రేగింది. అమెరికా తీరం వైపు భారీగా మాదకద్రవ్యాలతో వస్తున్న ఓ సెమీ-సబ్‌మెర్సిబుల్ నౌకను అమెరికా సైన్యం బాంబులతో పేల్చివేసింది. అంతర్జాతీయ డ్రగ్స్ రవాణాకు కీలక మార్గంగా ఉన్న ఈ ప్రాంతంలో జరిగిన ఈ ఆపరేషన్‌లో ఇద్దరు స్మగ్లర్లు అక్కడికక్కడే మరణించారు. ఈ దాడి ద్వారా సుమారు 25,000 మంది అమెరికన్ల ప్రాణాలను కాపాడినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఈ ఘటనపై తన అధికారిక సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్' ద్వారా ట్రంప్ స్పందించారు. "అమెరికాలోకి ప్రాణాంతకమైన ఫెంటానిల్, ఇతర మాదకద్రవ్యాలను రవాణా చేస్తున్న భారీ సబ్‌మెరైన్‌ను మన సైన్యం విజయవంతంగా ధ్వంసం చేసింది. ఈ ఆపరేషన్ నాకు ఎంతో గర్వకారణం. ఒకవేళ ఈ నౌక మన తీరానికి చేరి ఉంటే దాదాపు 25,000 మంది అమాయక అమెరికన్లు ప్రాణాలు కోల్పోయేవారు. ఈ దాడిలో ఇద్దరు టెర్రరిస్టులు హతమయ్యారు" అని ఆయన పేర్కొన్నారు. ఈ దాడికి సంబంధించిన దృశ్యాలను అమెరికా రక్షణ విభాగం పెంటగాన్ ఎక్స్‌లో విడుదల చేసింది. ఆ వీడియోలో, సముద్ర జలాల్లో వేగంగా ప్రయాణిస్తున్న సెమీ-సబ్‌మెర్సిబుల్‌పై అమెరికా హెలికాప్టర్ల నుంచి బాంబులు వర్షంలా కురవడం, అనంతరం అది పేలిపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. గురువారం జరిగిన ఈ ఆపరేషన్ తర్వాత, నౌక శకలాల నుంచి ప్రాణాలతో బయటపడిన ఇద్దరిని యూఎస్ దళాలు రక్షించి, తమ యుద్ధనౌకకు తరలించాయి. పట్టుబడిన వారిలో ఒకరు ఈక్వెడార్, మరొకరు కొలంబియా దేశస్థులని అధికారులు ధ్రువీకరించారు. వారిని విచారణ నిమిత్తం స్వదేశాలకు పంపిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. గత ఏడాది సెప్టెంబర్ నుంచి కరేబియన్ ప్రాంతంలో అమెరికా ఇలాంటి ఆపరేషన్లు చేపట్టడం ఇది ఆరోసారి కావడం గమనార్హం. ఈ దాడుల్లో ఇప్పటివరకు మొత్తం 29 మంది డ్రగ్ స్మగ్లర్లు మరణించారు. మెక్సికన్ డ్రగ్స్ కార్టెల్స్‌పై తమది కేవలం నిఘా మాత్రమే కాదని, ఇదొక "సాయుధ పోరాటం" అని ట్రంప్ ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. 9/11 ఉగ్రదాడుల అనంతరం టెర్రరిజంపై యుద్ధం కోసం రూపొందించిన చట్టపరమైన అధికారాలనే ఇప్పుడు ఈ డ్రగ్స్ కార్టెల్స్‌పై ప్రయోగిస్తుండటం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. "సముద్ర, భూ మార్గాల ద్వారా మా దేశంలోకి విషాన్ని పంపాలని చూసే మాదకద్రవ్యాల టెర్రరిస్టులను అమెరికా ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు" అని ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు.

## ఢిల్లీలో గర్భిణీ, ప్రియుడి హత్య

**ప్రియుడి చేతిలో ప్రాణాలు కోల్పోయిన మహిళ**

**అక్కడిక్కడే ప్రియుడ్ని చంపేసిన భర్త ఆకాశ్**

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో దారుణ ఘటన చోటుచేసుకుంది. వివాహేతర సంబంధం ఇద్దరి ప్రాణాలు తీసింది. కళ్లెదుటే తన భార్యను ప్రియుడు కత్తితో పొడిచి చంపడంతో, ఆగ్రహంతో ఊగిపోయిన భర్త అదే కత్తితో అతడిని అంతమొందించాడు. ఈ షాకింగ్ ఘటన మధ్య ఢిల్లీలోని రామ్ నగర్ ప్రాంతంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామ్ నగర్ ప్రాంతానికి చెందిన ఆకాశ్ (23) ఇ-రిక్షా నడుపుతూ జీవిస్తున్నాడు. అతడి భార్య శాలిని (22). వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శనివారం రాత్రి శాలిని, ఆకాశ్ ఇద్దరూ కుతుబ్ రోడ్డులో ఉన్న శాలిని తల్లిని కలిసేందుకు వెళ్తున్నారు. ఇంతలో, ఆశు అలియాస్ శైలేంద్ర (34) అనే వ్యక్తి అకస్మాత్తుగా వారిని అడ్డగించి, ఆకాశ్ పై కత్తితో దాడికి యత్నించాడు. ఆకాశ్ తప్పించుకోవడంతో, రిక్షాలో కూర్చున్న గర్భిణి అయిన శాలినిపై విచక్షణారహితంగా పలుమార్లు పొడిచాడు. భార్యను కాపాడే ప్రయత్నంలో ఆకాశ్, ఆశుపై తిరగబడ్డాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. ఆకాశ్ కు కూడా కత్తిగాయాలయ్యాయి. అయినప్పటికీ, ఆశుపై పైచేయి సాధించి, అతని చేతిలోని కత్తిని లాక్కుని దాంతోనే అతడిని పొడిచి చంపేశాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు, శాలిని సోదరుడు రోహిత్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన శాలిని, ఆకాశ్ లను ఆసుపత్రికి తరలించగా, పోలీసులు ఆశును అదే ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే, అప్పటికే శాలిని, ఆశు మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఆకాశ్ ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. మధ్య ఢిల్లీ డీసీపీ నిధిన్ వన్సాల్ ఈ ఘటనపై మరిన్ని వివరాలు వెల్లడించారు. కొన్నేళ్ల క్రితం ఆకాశ్, శాలిని మధ్య మనస్పర్థలు రావడంతో ఆమె స్థానిక నేరచరితుడైన ఆశుతో సంబంధం పెట్టుకుందని తెలిపారు. కొంతకాలం అతనితో సహజీవనం చేసి, ఆ తర్వాత మళ్లీ భర్త ఆకాశ్ దగ్గరికే తిరిగి వచ్చేసిందని చెప్పారు. ఈ పరిణామం ఆశుకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. శాలిని కడుపులో పెరుగుతున్న బిడ్డ తన వల్లేనని, ఆకాశ్ తండ్రి కాదని అతను వాదిస్తున్నాడు. అయితే, తన భర్తే బిడ్డకు తండ్రి అని శాలిని స్పష్టం చేయడంతో, కోపం పెంచుకున్న ఆశు ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. శాలిని తల్లి షీలా ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య, హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## డొనెట్స్క్ ఇస్తేనే యుద్ధం ఆగుతుంది

రష్యా అధ్యక్షుడు పుతిన్ డిమాండ్

మాస్కో: ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని ఆపేయాలంటే డొనెట్స్క్ ప్రాంతాన్ని తమకు అప్పగించాలని రష్యా ప్రెసిడెంట్ వ్లాదిమిర్ పుతిన్ డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఇదే విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు వివరించినట్లు తెలుస్తోంది. రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి నెలకొల్పేందుకు ట్రంప్ మధ్యవర్తిత్వం చేస్తున్న విషయం తెలిసిందే. శాంతి చర్చల్లో భాగంగా ఇరు దేశాధినేతలతో ట్రంప్ పలుమార్లు భేటీ అయ్యారు. ఈ క్రమంలోనే రష్యా అధ్యక్షుడు పుతిన్ కు ట్రంప్ ఇటీవల ఫోన్ చేయగా.. డొనెట్స్క్ తమకు అప్పగించాలని పుతిన్ డిమాండ్ చేశారని సమాచారం. ఉక్రెయిన్ కు చెందిన జపరోజియా, ఖేర్సన్ ప్రాంతాలను రష్యా బలగాలు ఇప్పటికే ఆక్రమించుకున్నాయి. ఈ భూభాగాలను తిరిగిచ్చేస్తామని పుతిన్ ఆఫర్ చేసినట్లు వైట్ హౌస్ వర్గాలను ఉటంకిస్తూ వాషింగ్టన్ పోస్ట్ ఓ కథనం ప్రచురించింది. అయితే, ఈ కథనంపై ఇంతవరకు అటు క్రెమ్లిన్ కానీ ఇటు వైట్‌హౌస్ కానీ స్పందించలేదు.




## ఫేక్ న్యూస్‌కు పాక్ అవార్డులు

**'ఆపరేషన్ సిందూర్'పై ఫేక్ న్యూస్ ప్రచారం**

**ఇద్దరు జర్నలిస్టులకు అవార్డులు ఇచ్చిన పాక్ ప్రభుత్వం**

ఇస్లామాబాద్: పాకిస్థాన్ ప్రభుత్వం తీసుకున్న ఓ నిర్ణయం తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో తప్పుడు సమాచారాన్ని, విద్వేషపూరిత ప్రచారాన్ని వ్యాప్తి చేసిన ఇద్దరు మీడియా ప్రతినిధులను పాక్ ప్రభుత్వం అవార్డులతో సత్కరించింది. ఈ చర్యపై మీడియా వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే, ఖమర్ చీమా, వజాహత్ కజ్మీ అనే ఇద్దరు జర్నలిస్టులకు ఈ పురస్కారాలు దక్కాయి. 'ఆపరేషన్ బున్యాద్ అల్ మర్సూస్' (భారత్-పాక్ ఘర్షణకు పాక్ పెట్టుకున్న పేరు) సమయంలో వారి మీడియా సేవలను ప్రశంసిస్తూ, ఖమర్ చీమాకు 'తమ్ఘా-ఏ-ఇంతియాజ్' పురస్కారాన్ని అందించారు. సింధ్ ముఖ్యమంత్రి చేతుల మీదుగా కజ్మీ స్మారక పురస్కారాన్ని అందుకున్నారు. అయితే, డిజిటల్ ఫోరెన్సిక్ రీసెర్చ్ అండ్ అనాలిసిస్ సెంటర్ దర్యాప్తులో దీనికి పూర్తి భిన్నమైన వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని డిస్ఇన్‌ఫర్మేషన్ కమిషన్ తెలిపింది. వీరిద్దరూ వాస్తవాలను వక్రీకరిస్తూ, ఉద్దేశపూర్వకంగా నకిలీ వార్తలను ప్రచారం చేశారని తమ నివేదికలో స్పష్టం చేసింది. ఘర్షణ సమయంలో ఖమర్ చీమా.. భారత విమానాలను కూల్చివేశామని, క్షిపణి వ్యవస్థలను ధ్వంసం చేశామని పదేపదే తప్పుడు ప్రకటనలు చేశారు. భారత వాయుసేనను అవమానించేందుకు ఏకంగా ఓ వీడియో గేమ్ ఫుటేజీని నిజమైన యుద్ధ దృశ్యాలుగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసి సంచలనం సృష్టించారు. అంతేకాకుండా, అమెరికా నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు చెందిన ఖారీ మహమ్మద్ యాకూబ్ షేక్‌తో చీమాకు సంబంధాలు ఉన్నాయని కూడా ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు, వజాహత్ కజ్మీ తన పాత మీడియా సంబంధాలను ఉపయోగించుకుని అసత్య కథనాలను పెద్ద ఎత్తున వ్యాప్తి చేశారు. గతంలో భారత క్రికెటర్ అర్ష్‌దీప్ సింగ్ క్యాచ్ వదిలేసిన ఘటనపై మతపరమైన వ్యాఖ్యలు చేసి వివాదాల్లో చిక్కుకున్నారు. దీనికి తోడు, 2016లో ఆయనపై ఓ ప్రముఖ పత్రికలో వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలు ఇప్పుడు మళ్లీ తెరపైకి వచ్చాయి. ఇలా తప్పుడు ప్రచారాలు, నైతికంగా వివాదాస్పదమైన ప్రవర్తనతో సంబంధం ఉన్న వ్యక్తులను గౌరవించడం ద్వారా, పాకిస్థాన్ ప్రభుత్వం అసత్య ప్రచారానికి అధికారికంగా మద్దతు తెలుపుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## కొత్త పార్టీల రిజిస్ట్రేషన్‌లో వేగమేది?

**6 వారాల్లోగా వెరిఫికేషన్ పూర్తి చేయాలని ఢిల్లీ హైకోర్టు ఈసీకి ఆదేశం**

చెన్నై/న్యూఢిల్లీ: తమిళనాడులో కొత్తగా ఏర్పాటైన ఒక రాజకీయ పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఢిల్లీ హైకోర్టు కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీఐ) ఆదేశించింది. సభ్యుల వెరిఫికేషన్ ప్రక్రియను ఆరు వారాల్లోగా పూర్తి చేసి, రిజిస్ట్రేషన్‌పై తదుపరి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ ఆదేశాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. వివరాల్లోకి వెళితే, తమిళనాడులోని కోయంబత్తూరులో ఈ ఏడాది ఏప్రిల్ 9న 'పార్టీ ఫర్ ది రైట్స్ ఆఫ్ అదర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్' అనే రాజకీయ పార్టీ ఏర్పాటైంది. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 29ఏ కింద పార్టీ రిజిస్ట్రేషన్ కోసం దాని అధ్యక్షుడు రత్న సభాపతి ఏప్రిల్ 29న ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ ప్రక్రియలో జాప్యం జరుగుతోందని, త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఉమ్మడి గుర్తుపై పోటీ చేసే అవకాశాన్ని కోల్పోతుందని ఆందోళన చెందుతూ ఆయన ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ మినీ పుష్కర్ణ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. "తమిళనాడులో 2026 జనవరిలో అసెంబ్లీ ఎన్నికల ప్రకటన వెలువడే అవకాశం ఉంది. రిజిస్ట్రేషన్‌లో జాప్యం జరిగితే, పార్టీ ఉమ్మడి గుర్తుపై పోటీ చేయలేని పరిస్థితి ఏర్పడుతుందని పిటిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు" అని కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. విచారణ సందర్భంగా, పార్టీ దరఖాస్తుకు సంబంధించిన భౌతిక వెరిఫికేషన్ కోసం అక్టోబర్ 13నే తమిళనాడు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌కు (సీఈఓ) లేఖ రాశామని, అయితే వారి నుంచి ఇంకా సమాచారం అందలేదని ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, వెరిఫికేషన్ ప్రక్రియను వీలైనంత వేగంగా, ఆరు వారాల్లోగా పూర్తి చేయాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని స్పష్టం చేసింది.

## ఎంఐఎం తొలి జాబితాలో ఇద్దరు హిందూ అభ్యర్థులు

పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల రాజకీయాలు వేగంగా మారుతున్న తరుణంలో, అసదుద్దీన్ ఓవైసీ నేతృత్వంలోని ఏఐఎంఐఎం పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. ఆదివారం నాడు 25 మంది అభ్యర్థులతో తన తొలి జాబితాను విడుదల చేసింది. అయితే, ఈ జాబితాలో ఇద్దరు హిందూ అభ్యర్థులకు స్థానం కల్పించడం ఆసక్తికరంగా మారింది. ఎక్కువగా ముస్లిం ఓటు బ్యాంకుపై ఆధారపడే పార్టీగా పేరున్న ఎంఐఎం, ఈసారి భిన్నమైన పంథాను ఎంచుకుంది. తమ పార్టీ అభ్యర్థుల జాబితాను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ప్రకటించింది. రాష్ట్రంలోని బలహీన, అణగారిన వర్గాల గొంతుకగా నిలుస్తామని ఈ సందర్భంగా పార్టీ స్పష్టం చేసింది. గత ఎన్నికల్లో సీమాంచల్ ప్రాంతంలో మంచి ఫలితాలు సాధించిన ఎంఐఎం, ఈసారి తన ప్రభావాన్ని మరింత విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. విడుదలైన జాబితా ప్రకారం, ఎంఐఎం రాష్ట్ర అధ్యక్షుడు అక్తరుల్ ఇమాన్ అమౌర్ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. ఇక హిందూ అభ్యర్థులైన రాణా రంజిత్ సింగ్‌కు ఢాకా స్థానం, మనోజ్ కుమార్ దాస్‌కు సికంద్రా స్థానం కేటాయించారు. వీరితో పాటు జోకిహత్ నుంచి ముర్షిద్ ఆలం, బహదూర్‌గంజ్ నుంచి తౌసిఫ్ ఆలం, కిషన్‌గంజ్ నుంచి షమ్స్ ఆగాజ్ వంటి కీలక నేతలకు కూడా టికెట్లు దక్కాయి. ఈ ఎన్నికల్లో ఎంఐఎం ఒంటరిగా కాకుండా, ఆజాద్ సమాజ్ పార్టీ మరియు జనతా పార్టీలతో కలిసి కూటమిగా పోటీ చేస్తోంది. దళితులు, మైనారిటీలు, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం తమ కూటమి పోరాడుతుందని ఎంఐఎం రాష్ట్ర అధ్యక్షుడు అక్తరుల్ ఇమాన్ తెలిపారు. కాగా, బీహార్ అసెంబ్లీ ఎన్నికలు రెండు విడతల్లో జరగనున్నాయి.

## పాక్-ఆఫ్ఘనిస్థాన్ మధ్య కాల్పుల విరమణ

కాబూల్: సరిహద్దుల్లో వారం రోజులుగా తీవ్ర ఉద్రిక్తతలు ఎదుర్కొంటున్న పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ దేశాలు ఎట్టకేలకు శాంతి బాట పట్టాయి. ఇరు దేశాల మధ్య తక్షణ కాల్పుల విరమణకు ఒప్పందం కుదిరినట్లు ఖతార్ విదేశాంగ శాఖ ఈ తెల్లవారుజామున ప్రకటించింది. ఈ ఒప్పందం ద్వారా డజన్ల కొద్దీ మరణాలకు, వందలాది మంది గాయపడటానికి కారణమైన సరిహద్దు ఘర్షణలకు తాత్కాలికంగా తెరపడినట్లయింది. ఖతార్ రాజధాని దోహాలో టర్కీ సహకారంతో జరిగిన ఈ చర్చల్లో ఇరు దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆఫ్ఘనిస్థాన్ తరఫున రక్షణ మంత్రి ముల్లా మహమ్మద్ యాఖూబ్, పాకిస్థాన్ తరఫున రక్షణ మంత్రి ఖవాజా ముహమ్మద్ ఆసిఫ్ ఈ చర్చలకు నాయకత్వం వహించారు.

వయ్యారి చిత్రం


ఊర్వశి రౌతేలా




## యాక్టివ్ మూడ్‌లోకి బండ్ల గణేష్

బండ్ల గణేష్.. నటుడిగా, నిర్మాతగా బహుశా తెలియని వారుండరేమో. కమెడియన్ గా యాక్టింగ్ కెరీర్ ను స్టార్ట్ చేసిన ఆయన.. ఆ తర్వాత బిజినెస్ ఫీల్డ్ లోకి అడుగుపెట్టారు. ఫౌల్ట్రీ వ్యాపారంలో విజయవంతం అయ్యాక మళ్లీ నిర్మాతగా టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చారు. అంతే కాదు తన కామెంట్స్, పోస్టులతో ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తుంటారు. ఇప్పటికే బాలీవుడ్ లో ఉన్న దీపావళి పార్టీ కల్చర్ ను ఇప్పుడు టాలీవుడ్ లో స్టార్ట్ చేశారు. దివాళీ అంటే టాలీవుడ్ సెలబ్రిటీల మొత్తంలో అందరికీ గుర్తొచ్చేది బండ్ల గణేషే. ఏటా ఆయన దివాళీ పేరుతో తాను పేల్చబోయే పటాకులతో ప్రదర్శన నిర్వహిస్తుంటారు. అందుకు సంబంధించిన పిక్స్, వీడియోస్ ఎప్పుడూ వైరల్ అవుతాయి. అయితే ఈసారి బాలీవుడ్ లో ఉన్న ట్రెండ్ ను ఇప్పుడు టాలీవుడ్ లో మొదలుపెట్టి శనివారం రాత్రి భారీ పార్టీని ఏర్పాటు చేశారు. బండ్ల దివాళీ 2025 పేరుతో ఆయన స్వగృహంలో నిర్వహించిన గ్రాండ్ పార్టీకి టాలీవుడ్ సీనియర్ స్టార్లు, యంగ్ హీరోలు, డైరెక్టర్లు, నిర్మాతలు సహా అనేక మంది అటెండ్ అయ్యారు. ఓ రేంజ్ లో సందడి చేశారు. బండ్ల దివాళీ ఈవెంట్ కు మెగాస్టార్ చిరంజీవి చీఫ్ గెస్ట్ గా రాగా, వెంకటేష్, శ్రీకాంత్, సిద్ధు, తేజ సజ్జా సహా అనేక మంది అటెండ్ అయ్యారు. అందుకు సంబంధించిన పిక్స్, వీడియోలు ఫుల్ వైరల్ గా మారాయి. అదిరిపోయాయని చెబుతున్న నెటిజన్లు.. బండ్ల గణేష్ సడెన్ గా పార్టీ చేయడానికి అసలు కారణమేంటోనని డిస్కస్ చేసుకుంటున్నారు. దీంతో అభిమానులు, సినీ ప్రియులు రకరకాల కామెంట్లు పెడుతున్నారు. చాలా కాలంగా ఇండస్ట్రీకి దూరంగా ఉన్న బండ్ల గణేష్.. ఇప్పుడు మళ్లీ యాక్టివ్ మోడ్ లోకి రావాలనుకుంటున్నట్లు తెలుస్తోంది.

## సంయుక్తా.. బ్లాక్ గోల్డ్

భీమ్లా నాయక్ సినిమాతో తెలుగులో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది మలయాళ బ్యూటీ సంయుక్తా మీనన్. ఈ భామ తొలిసారి హీరోయిన్ సెంట్రిక్ సినిమాతో ఎంటర్‌టైన్ చేయడానికి రెడీ అవుతోంది. యోగేశ్ కేఎంసీ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రానికి సంయుక్తామీనన్ సమర్పకురాలిగా వ్యవహరిస్తుండటం విశేషం.. షూటింగ్ కొనసాగుతోంది. కాగా ఈ మూవీ టైటిల్‌ను లాక్ చేశారు మేకర్స్. ఈ చిత్రానికి బ్లాక్ గోల్డ్ టైటిల్‌ను ఫిక్స్ చేసినట్టు తెలియజేస్తూ లుక్ ఒకటి విడుదల చేశారు. బొగ్గు షేడ్స్ బ్యాక్ డ్రాప్‌లో రాళ్లతో డిజైన్ చేసినట్టుగా ఉన్న టైటిల్ లుక్ మధ్యలో నాట్యం చేస్తున్న ప్రతిమ ఒకటి చూడొచ్చు. మొత్తానికి ఈ సినిమా నల్లబంగారం (బొగ్గు)చుట్టూ తిరుగుతుందని డైరెక్టర్ హింట్ ఇచ్చినట్టు టైటిల్ లుక్ చెప్పకనే చెబుతోంది. ఈ మూవీ ఫస్ట్ లుక్‌ను సోమవారం దీపావళి సందర్భంగా లాంచ్ చేయనున్నట్టు తెలిపారు. సంయుక్తామీనన్ పవర్ ఫుల్ కమాండింగ్ రోల్‌లో కనిపించనున్నట్టు టైటిల్ లుక్ చెబుతోంది. ఈ మూవీని హాస్య మూవీస్, మాగంటి పిక్చర్స్ బ్యానర్లపై సంయుక్తంగా రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి శ్యామ్ సీఎస్ మ్యూజిక్ అందిస్తున్నాడు.



## స్క్రిప్ట్ వినకుండానే ఓకే చేశా



హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న భారీ బడ్జెట్ యాక్షన్ ఎంటర్‌టైన్‌మెంట్ మూవీ ఉస్తాద్ భగత్ సింగ్‌లో ఇద్దరు ముద్దుగుమ్మలు నటిస్తున్న విషయం తెల్సిందే. మొదట హీరోయిన్‌గా శ్రీలీల అంటూ ప్రచారం జరిగింది. షూటింగ్ ప్రారంభం అయిన తర్వాత కొన్నాళ్లకు రాశి ఖన్నా సైతం ఈ సినిమాలో ఉందంటూ వార్తలు వచ్చాయి. రాశి ఖన్నా సైతం ఒకటి రెండు సందర్భాల్లో సినిమాలో తాను ఉన్నట్లుగా పేర్కొంది. పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో రాశి ఖన్నా మెయిన్ లీడ్‌గా నటిస్తున్న మాట వాస్తవం, అయితే ఆమె పాత్ర ఎలా ఉంటుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఈ సమయంలో స్వయంగా ఆమె నుంచి ఆసక్తికర ప్రకటన వచ్చింది. 'చాలా కాలం నుంచి పవన్ కళ్యాణ్ గారితో ఒక్క సినిమా అయినా చేయాలని కోరుకున్నాను. ఆయన సినిమాలో చిన్న పాత్ర వచ్చినా చాలు, ఆయనతో ఒక్కసారి స్క్రీన్ షేర్ చేసుకుంటే చాలు అన్నట్లుగా ఎదురు చూస్తున్నాను. అలాంటి సమయంలో హరీష్ శంకర్ నాకు ఉస్తాద్ భగత్ సింగ్ లో ఒక పాత్రను ఆఫర్ చేసినప్పుడు చాలా సంతోషంగా అనిపించింది. పవన్ కళ్యాణ్ గారి సినిమా అనగానే నేను మరో ఆలోచన లేకుండా ఒప్పుకున్నారు. నా కెరీర్‌లో ఇప్పటి వరకు చాలా సినిమాలు చేశాను, కానీ ఏ ఒక్కటి కూడా స్క్రిప్ట్ వినకుండా, పాత్ర గురించి తెలుసుకోకుండా కమిట్ కాలేదు.



## ఇప్పుడు నేను చాలా బిజీ: హరితేజ

ఒక్క ఛాన్స్‌తోనే తన లైఫ్ మొత్తం మారిపోయిందని చెప్తున్నారు నటి హరితేజ. తెలుగు బుల్లితెర ప్రేక్షకులకు హరితేజ ఎవరో కొత్తగా పరిచయం చేయనక్కర్లేదు. పలు సీరియల్స్, టీవీ షోల్లో నటించిన హరి తేజ, బిగ్ బాస్ రియాలిటీ షో తో ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. బిగ్ బాస్1 ద్వారా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని పాపులరయ్యారు హరితేజ. సీరియల్స్ తో పాటూ వంటల షో కు హోస్ట్ గా వ్యవహరించిన హరి తేజ ఇప్పుడు ఎక్కువగా సినిమాలపైనే ఫోకస్ చేశారు. ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్టుగా పలు సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్న హరి తేజకు వరుస అవకాశాలు రావడానికి కారణం డైరెక్టర్ త్రివిక్రమేనని ఆమె చెప్తున్నారు. అ..ఆ సినిమాలో త్రివిక్రమ్ పని మనిషి క్యారెక్టర్ ఇవ్వడం వల్ల తన లైఫ్ మొత్తం మారిపోయిందని హరితేజ తెలిపారు. త్రివిక్రమ్ పని మనిషి క్యారెక్టర్ కోసం వెతుకుతున్న టైమ్ లో ఓ రోజు టీవీ చూస్తున్నప్పుడు వంటల షోలో తనను చూసి, ఆ జోక్స్, కామెడీ విని ఈ అమ్మాయిని తీసుకురమ్మని తన టీమ్ కు చెప్పారని, తనకు ఫోన్ చేసి త్రివిక్రమ్ సినిమా అని చెప్పగానే షాకయ్యానని హరితేజ చెప్పారు. కానీ ఆ క్యారెక్టర్ కోసం ఆడిషన్ ఇచ్చాక తనకు ఏమీ చెప్పలేదని, వారం రోజులయ్యాక ఇక ఆఫర్ పోయినట్టేలే అనుకుంటున్న టైమ్ లో ఫోన్ చేసి డేట్స్ కావాలని అడిగారని, కనీసం కథేంటో కూడా అడక్కుండానే తాను ఆ సినిమాకు ఒప్పుకున్నట్టు హరితేజ చెప్పారు.



## మగబిడ్డకు జన్మనిచ్చిన పరిణీతి



పరిణీతి చోప్రా పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. గత ఏడాది ఆప్ పార్టీ ఎంపీ రాఘవ చద్దాను ప్రేమించి మరీ పెళ్లి చేసుకుంది. తాజాగా పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ జంట.. ఈరోజు మా హృదయాలు సంతోషంతో నిండిపోయాయి. మొత్తానికి మా బేబీ బాయ్ వచ్చేసాడు. ఈరోజు కోసమే మేము చాలా ఎదురు చూస్తున్నాం.. అతన్ని చేతిలోకి తీసుకోవడానికి ఇక ఎదురు చూడలేకపోతున్నాము. మీ ప్రేమ, ఆప్యాయతకు ధన్యవాదాలు అంటూ తెలిపింది. ఇకపోతే పరిణితి చోప్రాకి కొడుకు పుట్టడంతో ఈ విషయం తెలుసుకున్న ప్రియాంక చోప్రా అమెరికా నుంచి ఇండియా బయలుదేరినట్లు సమాచారం. మొత్తానికైతే తమ సోదరికి కొడుకు పుట్టాడన్న ఆనందంతో ప్రియాంక చోప్రా ఉబ్బితబ్బివతున్నట్లు తెలుస్తోంది. ఇక ప్రియాంక చోప్రాకి కూతురు ఉన్న విషయం తెలిసిందే. మరొకవైపు రాఘవ్ చద్దా ఇటీవల రాజ్యసభ ఎంపీగా ప్రమోషన్ కూడా పొందారు. మొత్తానికైతే దీపావళి ముందే ఈ ఇంట్లో సంబరాలు అంబరాన్ని అంటుతున్నాయి.

## ప్రభాస్-హను.. సాయంత్రం 4 గంటలకు..!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా ఇప్పుడు చేస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో దర్శకుడు హను రాఘవపూడి కాంబినేషన్ లో చేస్తున్న అవైటెడ్ చిత్రం కూడా ఒకటి. మంచి హైప్ ఉన్న ఈ సినిమాలో ఇమాన్వి హీరోయిన్ గా నటిస్తుండగా రీసెంట్ గానే దర్శకుడు హను రాఘవపూడి ఈసారి ప్రభాస్ బర్త్ డేకి సాలిడ్ ట్రీట్ ఉండబోతున్నట్టుగా కన్ఫర్మ్ చేసేసారు. ఇక లేటెస్ట్ గా మేకర్స్ కూడా ఇంట్రెస్టింగ్ అప్డేట్ ని అందించారు. అక్టోబర్ 20న సాయంత్రం 4 గంటల 5 నిమిషాలకి యుద్ధానికి కావాల్సిన సైన్యం ఏంటి అనేది రివీల్ చేస్తున్నట్టుగా కన్ఫర్మ్ చేశారు. దీనితో ఈ ప్రాజెక్ట్ ఫ్యాన్స్ మరింత ఎగ్జైట్ అవుతున్నారు. ఆల్రెడీ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్స్ పై హింట్స్ ఉన్నాయి. అలానే రిలీజ్ డేట్ కూడా అనౌన్స్ చేస్తారని టాక్. సో ఇవన్నీ ఆన్ ది వే అనే చెప్పొచ్చు. ఇక ఈ భారీ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహిస్తుండగా అనుపమ్ ఖేర్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.




# గెలిచే మ్యాచ్‌లో ఓటమి

**భారత మహిళల జట్టు హ్యాట్రిక్ ఓటమి**

**5 పరుగుల తేడాతో ఇంగ్లండ్ గెలుపు**

మహిళల టీ20 ప్రపంచకప్ 2025 టోర్నీలో టీమిండియాకు మరో ఓటమి ఎదురైంది. వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఓడి హ్యాట్రిక్ పరాజయాలను మూటగట్టుకుంది. ఆదివారం ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 5 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. మరోసారి ఒత్తిడిని తట్టుకోలేక సునాయసంగా గెలవాల్సిన మ్యాచ్‌ను హర్మన్‌ప్రీత్ సేన చేజార్చుకుంది. కీలక సమయంలో సెటిల్ అయిన బ్యాటర్లు ఔటవ్వడం టీమిండియా కొంపముంచింది. ఒక్క బ్యాటర్ క్రీజులో నిలిచినా ఫలితం మరోలా ఉండేది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 288 పరుగులు చేసింది. హీథర్ నైట్(91 బంతుల్లో 15 ఫోర్లు, సిక్స్‌తో 109) సెంచరీతో చెలరేగగా.. అమీ జోన్స్(68 బంతుల్లో 8 ఫోర్లతో 56) హాఫ్ సెంచరీతో రాణించింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ(4/51) నాలుగు వికెట్లు తీయగా.. తెలుగు తేజం శ్రీ చరణి(2/68) రెండు వికెట్లు పడగొట్టింది.



## 93 ఏళ్లలో ఒకే ఒక్కడు.. నితీష్ కుమార్ రెడ్డి

టీమిండియా ఆల్‌రౌండర్, తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి చరిత్ర సృష్టించాడు. 93 ఏళ్ల భారత క్రికెట్ చరిత్రలో పెర్త్ వేదికగా టెస్ట్, వన్డే క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన ఏకైక ఆటగాడిగా నిలిచాడు. ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా పెర్త్ వేదికగా జరుగుతున్న తొలి మ్యాచ్‌తో నితీష్ కుమార్ రెడ్డి అంతర్జాతీయ వన్డేల్లోకి అరంగేట్రం చేశాడు. టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ చేతుల మీదుగా అరంగేట్ర క్యాప్ అందుకున్నాడు. దాంతో నితీష్ మూడు ఫార్మాట్ల ఆటగాడిగా నిలిచాడు. ఇప్పటికే నితీష్ భారత్ తరఫున 9 టెస్ట్‌లు, నాలుగు టీ20లు ఆడాడు. గతేడాది బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 2024-2025లో భాగంగా పెర్త్ వేదికగా జరిగిన టెస్ట్‌తో నితీష్ సుదీర్ఘ ఫార్మాట్‌లోకి అరంగేట్రం చేసిన విషయం తెలిసిందే. ఆ సిరీస్‌లో భారత్ గెలిచిన ఏకైక మ్యాచ్ కూడా ఇదే కావడం గమనార్హం. పెర్త్ వేదికగా బరిందర్ శ్రణ్, సుబ్రోతో బెనర్జీలు భారత్ తరఫున వన్డేల్లోకి అరంగేట్రం చేయగా.. హర్షిత్ రాణా, వినయ్ కుమార్‌లు టెస్ట్‌ల్లోకి ఎంట్రీ ఇచ్చారు. నితీష్ ఒక్కడే పెర్త్ వేదికగా టెస్ట్‌తో పాటు వన్డేల్లోకి అరంగేట్రం చేశాడు.

ఆస్ట్రేలియా పర్యటనను టీమిండియా ఓటమితో ప్రారంభించింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా పెర్త్ వేదికగా ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన ఆసీస్ డక్‌వర్త్ లూయిస్ ప్రకారం 7 వికెట్ల తేడాతో టీమిండియాను ఓడించింది. పదే పదే వర్షం అంతరాయం కలిగించడంతో ఈ మ్యాచ్‌ను 26 ఓవర్లకు కుదించారు.

ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 26 ఓవర్లలో 9 వికెట్లకు 136 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్(31 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 38), అక్షర్ పటేల్(38 బంతుల్లో 3 ఫోర్లతో 31), నితీష్ కుమార్ రెడ్డి(11 బంతుల్లో 2 సిక్సర్లతో 19 నాటౌట్) మినహా మరే బ్యాటర్ చెప్పుకోదగ్గ స్కోర్ చేయలేదు. ఎన్నో అంచనాలతో బరిలోకి దిగిన టీమిండియా వెటరన్ బ్యాటర్లు రోహిత్ శర్మ(8), విరాట్ కోహ్లీ(0) తీవ్రంగా నిరాశపర్చారు.




# రోకో.. ఫ్లాప్!




**టీమిండియా ఓటమి**

**7 వికెట్ల తేడాతో ఆసీస్ గెలుపు**

**పదే పదే వర్షం అంతరాయం**

ఆసీస్ బౌలర్లలో జోస్ హాజెల్ వుడ్(2/20), మిచెల్ ఓవెన్(2/20), మాథ్యూ కుహ్నేమన్(2/14) రెండేసి వికెట్లు తీయగా.. మిచెల్ స్టార్క్, నాథన్ ఎల్లిస్ తలో వికెట్ తీసారు. డక్‌వర్త్ లూయిస్ ప్రకారం ఆస్ట్రేలియా లక్ష్యాన్ని 26 ఓవర్లలో 131 పరుగులుగా నిర్ణయించారు. ఆసీస్ 21.1 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి 131 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. కెప్టెన్ మిచెల్ మార్ష్(52 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 46 నాటౌట్), జోష్ ఫిలిప్(29 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 37), మ్యాట్ రేన్‌షా(24 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 21 నాటౌట్) రాణించారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ తలో వికెట్ తీసారు. ఈ విజయంతో మూడు వన్డేల సిరీస్‌లో ఆసీస్ 1-0తో ఆధిక్యంలో నిలిచింది. భారీ అంచనాలతో బరిలోకి దిగిన రోహిత్ శర్మ(8), విరాట్ కోహ్లీ(0) వైఫల్యం టీమిండియా విజయవకాశాలను దెబ్బతీసింది. ఆరంభంలోనే ఈ ఇద్దరూ ఔటవ్వడంతో జట్టుపై అదనపు ఒత్తిడి పడింది. వర్షం కూడా టీమిండియా విజయవకాశాలను దెబ్బతీసింది. ఇరు జట్ల మధ్య రెండో వన్డే గురువారం(అక్టోబర్ 23) జరగనుంది.

**కొంపముంచిన డీఎల్ఎస్!**

టాస్ నుంచి డీఎల్ఎస్(డక్‌వర్త్ లూయిస్) లెక్కల వరకు ఏదీ శుభ్‌మన్ గిల్ సేనకు కలిసి రాలేదు. ఓవర్‌కాస్ట్ కండీషన్స్‌లో టాస్ ఓడిపోవడం టీమిండియాకు నష్టం చేస్తే.. వరణుడు పూర్తిగా ముంచేసాడు. అర్థం పర్థం లేని డీఎల్ఎస్ లెక్కలు భారత్ పోరాటాన్ని నీరుగార్చాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా ఆదిలోనే రోహిత్ శర్మ(8), విరాట్ కోహ్లీ(0), శుభ్‌మన్ గిల్(10) వికెట్లు కోల్పోయింది. ఓవర్‌కాస్ట్ కండిషన్స్‌ను అడ్వాంటేజ్‌గా మార్చుకున్న ఆసీస్ బౌలర్లలో తొలి పవర్ ప్లేలో నిప్పులు చెరిగారు. మరోవైపు వన్డే ఫార్మాట్ తరహాలో భారత్ నిదానంగా ఆడింది. కానీ పదే పదే వర్షం అంతరాయం కలిగించడం.. గంటల తరబడి ఆట ఆగిపోవడంతో 50 ఓవర్ల మ్యాచ్ కాస్త 26 ఓవర్ల గేమ్‌గా మారిపోయింది. కానీ ఈ నిర్ణయం తీసుకునేసరికే భారత్ అప్పటికే 16. 4 ఓవర్లు ఆడేసింది. 4 వికెట్లు కోల్పోయి 52 పరుగులే చేసింది.దాంతో చివరి 9.2 ఓవర్లలో టీమిండియా దూకుడుగా ఆడాల్సి వచ్చింది. ఈ ప్రయత్నంలో భారత బ్యాటర్లు వరుసగా వికెట్లు కోల్పోయారు. ఆసీస్ ప్రధాన పేసర్లు మిచెల్ స్టార్క్(6 ఓవర్లు), జోష్ హాజెల్ వుడ్(7 ఓవర్లు), నాథన్ ఎల్లిస్(5 ఓవర్లు) ఎక్కువ ఓవర్లు వేసి టీమిండియాకు చేయాల్సిన నష్టం చేశారు. వర్షం కారణంగా మ్యాచ్ మధ్యలో డీఎల్ఎస్ లెక్కలు రావడంతో భారత్‌కు తీవ్ర నష్టం జరిగింది. భారత్ విధించిన లక్ష్యం కాస్త డీఎల్ఎస్ లెక్కల ప్రకారం 136 నుంచి 131గా మారింది.

## స్టార్క్ వరల్డ్ రికార్డ్.. కానీ!


భారత్, ఆస్ట్రేలియా మధ్య మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్‌లో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో బ్రాడ్‌కాస్టర్ తప్పిదం కారణంగా.. అంతర్జాతీయ క్రికెట్‌లోనే అత్యంత వేగవంతమైన బంతిని వేసిన బౌలర్‌గా ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ నిలిచాడు. ప్రపంచంలో ఫాస్టెస్ట్ బాల్ రికార్డ్ పాకిస్థాన్ దిగ్గజ పేసర్ షోయబ్ అక్తర్ పేరిట ఉంది. అయితే ఈ ఫీట్‌ను తాజా వన్డేలో మిచెల్ స్టార్క్ అధిగమించినట్లు సోషల్ మీడియాలో జోరుగా చర్చ సాగుతోంది. పెర్త్ వేదికగా జరుగుతున్న తొలి వన్డేలో తొలి బంతినే మిచెల్ స్టార్క్ గంటకు 176.5 కిలోమీటర్ల వేగంతో సంధించినట్లు బ్రాడ్ కాస్టర్ చూపించింది. ఇందుకు సంబంధించిన స్క్రీన్ షాట్స్ నెట్టింట వైరల్‌గా మారాయి. మిచెల్ స్టార్క్ సాధారణంగా గంటలకు 140 ప్లస్ కిలోమీటర్ల వేగంతో బంతులు సంధిస్తాడు. కానీ బ్రాడ్‌కాస్టర్ మాత్రం స్టార్క్ డెలివరీ స్పీడ్‌ను 176.5 కేపీహెచ్‌గా చూపించడంతో అంతా అవాక్కయ్యారు. కానీ అది స్పీడ్ గన్ తప్పిదం కారణంగా ఇలా చూపించారని తేలడంతో నెటిజన్లు సెటైర్లు పేల్చుతున్నారు.



## అందుకే లండన్‌కు షిఫ్ట్ అయ్యా: కోహ్లీ

కుటుంబంతో ఎక్కువ సమయం గడిపేందుకే తాను లండన్‌కు షిఫ్ట్ అయ్యానని టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తెలిపాడు. తండ్రిగా తన పిల్లలతో ఆడుకోవడాన్ని ఆస్వాదించానని చెప్పాడు. ఈ ఫేజ్ చాలా అద్భుతంగా ఉందని సంతోషం వ్యక్తం చేశాడు. ఐపీఎల్ 2025 సీజన్ అనంతరం యూకేకు వెళ్లి పోయిన విరాట్ కోహ్లీ.. గత కొన్ని నెలలుగా అక్కడే ఫ్యామిలీతో గడిపాడు. ఆస్ట్రేలియా పర్యటన కోసమే గత వారం భారత్‌కు తిరిగి వచ్చాడు. టీ20, టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన కోహ్లీ.. తన వ్యాపార వ్యవహారాలను కూడా పక్కనపెట్టి కుటుంబానికి తన సమయాన్ని కేటాయించాడు. ఆస్ట్రేలియాతో తొలి వన్డే ప్రారంభానికి ముందు టీమిండియా మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి, ఆస్ట్రేలియా దిగ్గజం ఆడమ్ గిల్‌క్రిస్ట్‌లతో కోహ్లీ చిట్ చాట్ చేశాడు. ఈ సందర్భంగా ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పటికే తాను అత్యధిక మ్యాచ్‌లు ఆడానని చెబుతూ..తన టెస్ట్ రిటైర్మెంట్ నిర్ణయాన్ని సమర్థించుకున్నాడు. 'టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత నాకు చాలా సమయం దొరికింది. ఈ బ్రేక్‌ను నేను పూర్తిగా కుటుంబానికే కేటాయించాను. జీవితాన్ని మళ్లీ అందుకునే ప్రయత్నం చేస్తున్నాను. గత కొన్నేళ్లుగా నేను నా కుటుంబానికి ఎక్కువ సమయం కేటాయించలేకపోయాను. కుటుంబంతో గడిపితే ఇంత ఆనందం వస్తుందని కూడా నాకు తెలియదు. నా పిల్లలతో గడపడం చాలా సంతోషాన్నిచ్చింది. వారితో ఆడుకోవడం.. వారి ఎదుగుదలను దగ్గరి నుంచి చూడటం బాగుంది. ఇది ఒక అందమైన దశ. కుటుంబంతో ఎక్కువ సమయం గడపడటంతో చాలా ఫ్రెష్‌గా, ఫిట్‌గా ఉన్నట్లు అనిపిస్తోంది. నెట్స్‌లో, ఫీల్డింగ్ సెషన్‌లో చాలా చురుకుగా కదులుతున్నాను.'అని కోహ్లీ చెప్పుకొచ్చాడు.

ఈవార్తలు
ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
సోమవారం 20-10-2025 | www.evarthalu.com




## అహంకారం ఆమె అందం.. అభిమానం ఆమె నడత.. విజయం ఆమెకు వెన్నెతో పెట్టిన విద్య.. సబలకు ఆమె ఓ రోల్ మోడల్.. సమాజాన్ని ఎదిరించిన వారియర్, సాత్రాజితి

ఆమెను అంతా అహంకారి అన్నారు.. మొగుణ్ణి కొంగున ముడేసుకుందన్నారు.. పెంకిపెళ్లామని ఈసడించుకున్నారు.. ముక్కుమీదే కోపం ఉందన్నారు. మొగుణ్ణి అమ్మేసిన జాణ అని తిట్టుకున్నారు. కుటుంబం పట్ల సరిగా వ్యవహరించలేదన్నారు. సవతులను అవమానించిందని ఆగ్రహించారు. మహిళాలోకంలో ఆమె ఓ నెగెటివ్ కేరెక్టర్.. ద్వాపర యుగంలో ఆమె కథ ఓ స్పెషల్ ఎపిసోడ్.. నిలువెత్తు బంగారం లాంటి నెరజాణ.. సత్రాజిత్తు కుమార్తె.. సత్యభామ.. ఎ రియల్ విమెన్ వారియర్.. సత్యభామ. పేరు చెప్పగానే మనకు ముందుగా గుర్తుకు వచ్చేది అహంకారం.. ఒక మహిళ అహంభావం పతాకస్థాయికి ఆమె అచ్చమైన ఉదాహరణ. కృష్ణుడి అష్టభార్యల్లో తీవ్రమైన లక్షణాలు ఉన్న వ్యక్తిగా సత్యభామ మనకు తెలుసు. నిజంగా ఆమెలో ఇంత నెగెటివ్ షేడ్ ఉందా? నిజంగానే ఆమె దురహంకారేనా? ఓ మహిళా విలన్గా ఆమె పాత్రను ఎలా చిత్రించారు..? అందమైన అహంకారం, ఆ అహం నుంచి పుట్టిన అస్తిత్వం, నడకలో వాడి, నడతలో వేడి. ముక్కుసూటి. ఆమె వ్యక్తిత్వమే ఓ స్పెషల్ అట్రాక్షన్.. ఆమె సత్యభామ.. శ్రీకృష్ణుడి ముద్దుల భార్య. అష్టభార్యల్లో ముచ్చటగా మూడో భార్య.. సృష్టి సౌందర్యం అంతా రాశిగా

# సత్యభామ.. వారియర్

పోతపోసుకుని పుట్టిన ముద్దుగుమ్మ. వేల నిర్వచనాలకైనా అందని ఆనందలక్ష్మి.. ఓటమి ఆమె ఎరుగని పదం. విజయం ఆమె హక్కు దాన్ని సాధించటం ఆమె నైజం. భర్తనైనా ఎదిరించటం ఆమె తత్త్వం, ఆధిపత్యం పరమసోపానం. సత్యభామ గురించి మాట్లాడుకున్నా, ఆమె పేరు ప్రస్తావనకు వచ్చిన ప్రతిసారీ ఈ విషయాలన్నీ గుర్తుకు వస్తాయి. ఎనిమిది మంది భార్యలున్నా, పదహారు వేల మంది గోపికలున్నా, అంతమందిలోనూ భర్తను కొంగున ముడివేసుకున్న మహిళగా ఆమె వ్యక్తిత్వం సుపరిచితమే. ఆమె నిటారుగా నిలబడితేనే నిలువెత్తు అహంభావానికి రూపమిచ్చి నట్లుంటుంది.. పురాణాల్లోనైనా, భాగవతంలోనైనా ఎవరితోనూ సఖ్యంగా ఉన్నట్లు మనకు కనిపించదు.. అంతా మంచి వాళ్లే, ఆమె మాత్రం దుర్మార్గురాలన్నట్లుగానే మనం వింటూ వస్తున్నాం.. ఆమె కేరెక్టర్ను అలాగే మన మనసుల్లో ముద్రించుకున్నాం. సత్యభామ కేరెక్టర్ ఇంత దుర్మార్గమైందా? ఆమె తానున్న సమాజంలో అందరినీ తిరస్కరించి, అందరికీ దూరంగా ఉండిపోయిందా? సత్యభామ నిజంగా అంత ఈసడించు కోదగిందా? ఆమె ఎందుకలా ప్రవర్తించింది? ఒక మహిళగా ఆమె జీవించిన తీరు ఎందుకు ఇంతగా అభ్యంతరకరమైంది? శ్రీకృష్ణుడితో చిన్ననాట రాసలీలలాడింది రాధాదేవి. బృందావనంలో కృష్ణుడి రసరాజ్యానికి ఆమె పట్టమహిషి.. శ్రీకృష్ణుడు ద్వారకకు చేరుకున్న తరువాత రాధాదేవి పాత్రను పోషించింది సత్యభామే. సత్యభామ ద్వారకానాథుడి శృంగార రసాధిదేవత. ఆమెలో అహంకారమే మనకు పైకి కనిపించిన, కనిపిస్తున్న వ్యక్తిత్వం. ఆ వ్యక్తిత్వంలో మనకు తెలియని కోణాలు మరెన్నో ఉన్నాయి.

క్రీస్తుపూర్వం 3228 నాటి మాట.. మధురలో కంసుడి జైల్లో జన్మించిన కృష్ణుడి గాథ.. పదకొండో ఏట కంసుణ్ణి సంహరించిన తరువాత మధురలో ఉన్నప్పుడు అంటే 25వ ఏట రుక్మిణితో వివాహం జరిగింది. రుక్మిణితో వివాహం ఓ సంచలనం. రుక్మిణితో వివాహం తరువాత సత్రాజిత్తు తన శ్యమంతక మణిని దొంగిలించాడని కృష్ణుడిపై నిందమోపాడు. దాన్ని మాపుకోవటానికి వెళ్లి మణితోపాటు జాంబవతిని వివాహం చేసుకుని వచ్చాడు కృష్ణుడు. సత్రాజిత్తు తన తప్పును తెలుసుకుని తన కూతురు సత్యభామను కృష్ణుడి చేతిలో ఉంచి వివాహం చేశాడు. మొత్తం ఎనిమిది వివాహాలు చేసుకుని అష్టభార్యలతో సంసారం చేయటం కృష్ణుడికి మాత్రమే సాధ్యమైంది. అష్టభార్యల్లో ఏడుగురు ఒక ఎత్తు.. సత్యభామ ఒక్కతే ఒక ఎత్తు.. ఆమె అహం ముందు మిగతా సపత్నులంతా ఓడిపోయారు.. 8 మందిలోనూ ఆమె తన ప్రత్యేకతను చాటుకుంది.. భర్తను తన వాడిగా చేసుకుంది.. సంపద, అభిమానం, పట్టుదల, భర్తపైన అపారమైన ప్రేమ కృష్ణుడిని కట్టిపడేసింది.

చివరకు ఆమె ప్రేమకు ఆయన దాసుడయ్యాడు. కృష్ణుడి భార్య సత్యభామ అని కాకుండా, సత్యాపతి కృష్ణుడనే లెవల్కి తన స్టేటస్ ను పెంచుకోగలిగింది సత్యభామ. తాను అనుకున్నది సాధించటం కోసం అధికారం చెలాయించింది... ముద్దు చేసింది. మురిపాలు పోసింది. వయ్యారానికి పోయింది. కోపగించుకుంది. అలకబూనింది.. కోపంతో తలనే తన్నింది. భర్తను తనవాడిగా చేసుకోవటం కోసం ఆయన్నే దానమివ్వటానికి కూడా వెనుకాడని మహిళ సత్యభామ. తనదైన వస్తువును, వ్యక్తిని ఇతరులెవరితోనూ పంచుకునేందుకు ఇష్టపడని అభిమానవతి.. ఇందుకోసం ఆమె దేనికైనా తెగించింది. సాహసించింది. సాధించింది. ఈ లక్షణమే ఆమెను అహంకారిని చేసింది. ఈ తెగింపే ఆమె నడతను నిందించింది. ఆమెను విలన్ గా మార్చింది. సత్యభామ నిజంగా అహంకారా? ఎవరికీ రాని సందేహం ఇది. ఎందుకంటే ఆమె స్వభావంలో కనిపించేదే అదైనప్పుడు ఆమె ధిక్కార ధోరణిపై అనుమానం దేనికి? అందరూ తప్పులో కాలేసే చోటు ఇదే. ఎందుకంటే ఆమె వ్యక్తిత్వంలో కనిపించే అహం– అహం కాదు. ఆమె తనను తాను అసర్ట్ చేసుకునేందుకు చేసిన పోరాటానికి ఓ ప్రతిరూపం.. ఒక మహిళగా తన ఉనికిని కాపాడుకునేందుకు సమాజాన్ని ఎదిరించి నిలిచిన అసాధారణ వ్యక్తిత్వానికి బింబం.

సత్యభామ వ్యక్తిత్వాన్ని ఇంతకాలం సమాజంలో ఓ వ్యతిరేక శక్తిగానే మనం చిత్రించుకుంటూ వచ్చాం. దుర్మార్గమైన మహిళగా ఉన్న సత్యభామ దురహంకారాన్ని కృష్ణుడు అణచివేసినట్లుగా చెప్పుకుంటున్నాం. కృష్ణుడి మిగతా ఏడుగురు భార్యలు చాలా మంచివారుగా, సత్యభామ మాత్రం తులసివనంలో గంజాయి మొక్కలా చెప్పుకొస్తున్నాం. కానీ సత్యభామ వ్యక్తిత్వం వక్రీకరణ జరిగింది. మోస్ట్ అడ్వాన్స్డ్ విమెన్కు ఆమె అచ్చమైన ప్రతీక. ఇదేమిటని ఆశ్చర్యపోకండి.. ఇది తిరుగులేని నిజం. సత్యభామ తన అస్తిత్వాన్ని కాపాడుకోవటానికి విరామం లేని పోరాటం చేసిన సబల. సత్యభామ కాలం నాటి సమాజం ఒక చిత్రమైన లక్షణం కలిగి ఉన్నది. బహు భార్యత్వాన్ని, బహు భర్తృత్వాన్ని అంగీకరించిన సమాజం. ఇందుకు ఉదాహరణ అయిదుగురు భర్తలు ఉన్న ద్రౌపది.. అష్టభార్యలున్న శ్రీకృష్ణుడు.. పైగా సమష్టి కుటుంబ వ్యవస్థ, భర్తను దేవుడితో సమానంగా చూడటం, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల వంటివి బలంగా వేళ్లూనుకునిపోయిన సమాజం ఆనాటిది.. అలాంటి సమాజంలో మహిళగా తన ప్రత్యేకతను నిలబెట్టుకోవటం కత్తిమీద సాము లాంటిది. కృష్ణుడి అష్టభార్యల్లో రుక్మిణి, సత్యభామ మినహా మిగతావాళ్లు అబలలుగానే వెనుకబడే ఉండిపోయారు. సత్యభామ మాత్రం తనను తాను అసెర్ట్ చేసుకోగలిగింది.

ఎనిమిది మంది భార్యల మధ్య భర్తను తనవాడిగా చేసుకోవటం కోసం తాపత్రయ పడింది. ఏ భార్యకైనా భర్త తనవాడుగా ఉండాలని ఉండటం తప్పుకాదు..



సత్యభామ అదే కోరుకుంది. అలా అని అత్తమామల పట్ల కానీ, సపత్నుల పట్ల కానీ, ఆమె ఎన్నడూ అమర్యాదగా ప్రవర్తించలేదు. కాకుంటే ఆమెలోని ఈగో తన భర్తను డామినేట్ చేసే దిశగా సాగింది. అలిగైనా సరే ఆయన్ను సాధించుకుంది. విజయవిలాసం వంటి కావ్యాల్లో, ఆ తరువాత వచ్చిన రకరకాల కథనాల్లో సత్యభామ పాత్రను రకరకాలుగా చిత్రించారు.. మగవాడి డామినేషన్కు కొంత వ్యతిరేకంగా వుండటంతో దాన్ని తగ్గించేందుకు, సప్రెస్ చేసేందుకు ఆమె అహంకారాన్ని అణచినట్లు, మిగతావారి పట్ల ఆమె అనుచితంగా ప్రవర్తించినట్లు కథను మార్చేశారు. వాస్తవానికి ఆమె ఆనాటికి తానున్న సొసైటీలో తన భర్త కోసం, తన వ్యక్తిత్వాన్ని నిలుపుకోవటం కోసం అనుక్షణం పోరాడింది. సాధారణంగా మహిళలో ఉండే ఆభిజాత్యమే ఆమెలోనూ ఉంది. ఎందుకంటే సత్యభామ ఆగర్భ శ్రీమంతురాలు.. రోజుకు ఎనిమిది బారువుల బంగారాన్ని ఇచ్చే శ్యమంతకమణిని వెంట తెచ్చుకున్న మహిళ.. అంతటి సంపద నుంచి వచ్చిన అహం, తామసం సహజంగానే ఆమె వ్యక్తిత్వాన్ని విశిష్టంగా మలచింది. మిగతా భార్యలందరిలోనూ ప్రత్యేకంగా నిలిచింది. భర్తను డామినేట్ చేయటం కాదు.. భర్తపట్ల పెత్తనం చెలాయించటం కాదు.. మిగతా భార్యల కంటే తానే ఎక్కువగా ప్రేమ కురిపించింది. ముద్దు మురిపాలు చేసింది. భర్త ప్రేమను పొందటమే కాదు.. పది మందిలో తానేమిటో నిరూపించుకోవటమే సత్యభామా కలాపం. భర్తను గౌరవించటం, భర్తను దేవుడిగా పూజించటం, భర్త మాటే వేదవాక్కుగా భావించటం మాత్రమే స్త్రీ జీవితం కాదని నిరూపించింది సత్యభామ. ఆత్మాభిమానం వుండటం అహం కాదు.. అభిమానం అంటే, ఆధిపత్యం చెలాయించటం కాదు. మొగుణ్ణి కొంగున ముడేసుకోవటం కాదు.. ప్రేమను పంచటం.. భర్త సుఖంలో, కష్టంలో పాలుపంచుకోవటం.. అతని బాధ్యతల్లో భాగం పంచుకోవటం.. అలాంటి అభిమానానికి భర్త దాసోహం అనక ఏం చేస్తాడు.. కృష్ణుడు అందుకే సత్యాపతి అయ్యాడు. శ్రీకృష్ణుడికి 8 మంది భార్యల్లో ఏడుగురిని ఆయన ఏదో రకంగా యుద్ధం చేసి తీసుకొచ్చి వివాహం చేసుకున్నాడు.

రుక్మిణీ వివాహం కూడా ఆమె నన్ను తీసుకుపొమ్మని ఉత్తరం రాస్తే వెళ్లి ఎత్తుకొచ్చేసి పెళ్లి చేసుకున్నాడు. సత్యభామ వివాహం మాత్రం అలా జరగలేదు. తండి సత్రాజిత్తు ఒప్పుకున్నాడు. తాను ఒప్పుకుంది. అందరి అంగీకారంతో సంప్రదాయబద్ధంగా జరిగిన పెళ్లి అది. పైగా సంపన్నవతి.. బంగారం లాగానే తామసం ఎక్కువ. అందుకే మిగతా అందరిలోనూ ఆమె రూటే సెపరేటు. కేవలం భార్యగా భర్తను పొందటమే కాదు.. అవసరమైతే భర్తకు దీటుగా, సరిసాటిగా నిరూపించుకుంది. ఆయనకు అండగా నిలిచి మహిళగా తన ప్రత్యేకతను రుజువు చేసుకుంది. నరకాసురుడి వధకు భర్తతో పాటు యుద్ధరంగానికి వెళ్లింది.. యుద్ధంలో భర్త అలసిపోతే, తానే ఆయుధం చేతపట్టింది. భీకరంగా పోరాడింది. నరకుణ్ణి తానే వధించింది. పదహారు వేల మంది కన్నెలను విడిపించింది. మహిళల కోసం పోరాడిన ఎ రియల్ విమెన్ వారియర్గా చరిత్రలో నిలిచిపోయింది. అన్ని రకాలుగా, అన్ని విధాలుగా ఒక మహిళ ఎలా ఉండాలో సత్యభామ ఉండి చూపించింది. ఇప్పుడున్న సమాజంలో ఇలాంటి అభిమానవతులు అవసరం. రకరకాల ఇన్ఫ్లుయెన్సెస్ పడటం వల్ల ఇవాళి మహిళలు పెళ్లి కాగానే భర్తను తమ చెప్పుచేతల్లో ఎలా పెట్టుకోవాలో ఆలోచిస్తారు.. తాము పుట్టినింటిని వదిలి వచ్చినప్పుడు తన భర్త మాత్రం అతని కుటుంబంతో ఎలా ఉండాలన్న స్థాయికి మోడ్రన్ మహిళ వచ్చేసింది. ఫలితం వేరు కాపురం.. వినకపోతే విడాకులు.. అంతా జస్టాల్.. మనల్ని మనం అసెర్ట్ చేసుకోవటం అంటే ఎదుటివాళ్లను అవమానించటం కాదు.. చిన్నచూపు చూడటం అంతకంటే కాదు.. నెగెటివ్ ఆటిట్యూడ్ను వదిలేసి సానుకూల కోణంలో వ్యవహరించటం ఈతరానికి ఉండాల్సిన బేసిక్ క్వాలిటీ.. ఇదిగో ఈ క్వాలిటీ సత్యభామ నుంచి నేర్చుకోవాలి.. తనలో అభిమానాన్ని కొంచెమైనా విడవకుండానే మహిళగా, భార్యగా, యోధాగా తానేమిటో నిరూపించుకుంది.. జస్ట్ ఒక్కసారి ఆలోచించండి.. ప్రతి భామా ఒక సత్యభామ అయితే, అలుకలూ, అనునయాలు ఉంటాయేమో కానీ, ఏ కాపురమూ కుప్పకూలదు.



కోవెల సంతోష్ కుమార్
రచయిత
9052116463

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.